స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

అక్షర
# రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575

శుక్రవారం | 28.03.2025 | సంపుటి : 2 | సంచిక :56 | పేజీలు : 8 | వెల : 2/-

## ఐదేళ్లలో 4,03,664కోట్ల అప్పులు



- కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పు రూ.2 లక్షల 20 వేల కోట్లు
- వెల్లడించిన కాగ్ నివేదిక
- అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 27 :** తెలంగాణ అసెంబ్లీలో గురువారం కాగ్ నివేదికను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించగా దానిని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఇందులో 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు కాగా, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా చెప్పారు. గత ఐదేళ్లలో 4లక్షల 3వేల 664 కోట్ల అప్పులు చేసినట్టు సదరు కాగ్ రిపోర్టులో వెల్లడైంది. 2023-24 ఏడాదిలో పబ్లిక్ మార్కెట్ నుంచి రూ. 49,618 కోట్ల అప్పులు తీసుకున్నట్టు కాగ్ పేర్కొంది. గత ఏడాది కాలంలో 200 శాతం ఎఇ పరిధి పెరిగినట్లు తెలిపింది. పలు కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పు రూ.2 లక్షల 20 వేల కోట్లని వెల్లడించింది. వేతనాల కోసం రూ.26,981 కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ రిపోర్ట్‌లో వెల్లడైంది.

మిగతా 2 లో

## తెలంగాణను అప్పులకుప్ప చేసి అప్పగించారు

### కక్ష సాధింపు చర్యలు తీసుకుంటే జైల్లో ఉండేవారు



- అప్పులకు వడ్డీలు కట్టడానికే సరిపోతోంది
- కాళేశ్వరం పేరుతో డబ్బులు వృథా చేశారు
- కేటీఆర్ కక్ష సాధింపు వ్యాఖ్యలపై సిఎం రేవంత్ ఆగ్రహం
- వాడీవేడీగా అసెంబ్లీ సమావేశాలు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో వాడి వేడిగా చర్చ పరస్పర విమర్శలకు దారితీసింది. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా మునుపెన్నడూ లేని స్థాయిలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య మాటల తూటాలు పేలాయి. సీఎం రేవంత్ రెడ్డి.. కేటీఆర్ మధ్య పరస్పర విమర్శలు చోటుచేసుకున్నాయి. తొలుత మాట్లాడిన కేటీఆర్.. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం తీవ్రంగా స్పందించారు. కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కక్ష సాధింపులకు పాల్పడితే కేటీఆర్ కుటుంబం అంతా జైల్లోనే ఉండేదన్నారు. కక్ష సాధింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం తమకు లేదని.. దేవుడు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు.

**హైదరాబాద్, మార్చి 27 :** కక్ష సాధింపుల ఆలోచన ప్రభుత్వానికి లేదు. కక్ష సాధిం పులకు పాల్పడితే మీరంతా చంచల్‌గూడ జైల్లోనే.. చర్లపల్లి జైల్లోనే ఉండేవారు. సలహాలు ఇస్తారనుకుంటే.. ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారు. అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేస్తే రూ. 500 ఫైన్ వేస్తారు. కానీ, ఎంపీగా ఉన్న తనను చర్లపల్లి జైలుకు పంపారు. జైల్లో నిద్రలేని రాత్రులు గడిపాను. డిటెన్షన్ సెల్లో 16 రోజులు నన్ను నిర్బంధించారు. రాత్రి పూట లైట్లు ఆపమని అడిగినా.. జైలు సిబ్బంది ఆపేవారు కాదు. ఎందుకని అడిగితే.. పై నుంచి ఆదేశాలు ఉన్నాయనే వారు. రాజకీయ కక్షసాధింపులు చేసింది మీరు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లా. కక్ష సాధింపు మీదా నాదా పైనుంచి దేవుడు అన్నీ చూస్తాడని వేచి చూశా. నేను ప్రమాణస్వీకారం చేసిన రోజే.. వాళ్లు ఆస్పత్రి పాలయ్యారు. నేను కక్ష సాధింపులకు పాల్పడితే మీ కుటుంబం అంతా జైలుపాలే. ఇప్పటివరకు మేం అక్రమ కేసులు పెట్టలేదు. కేటీఆర్, కేసీఆర్‌ను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్షపూరిత రాజకీయాలు చేసే వ్యక్తిని కాదని రేవంత్ అన్నారు.

మిగతా 2 లో

## డీలిమిటేషన్‌తో దక్షిణాదిని లిమిట్ చేసే కుట్ర

- జనాభా ప్రాతిపదికన అంగీకరించే ప్రసక్తి లేదు
- 24 నుంచి 19 శాతానికి పడిపోనున్న దక్షిణాది ప్రాతినిధ్యం
- 11 ఏళ్లయినా ఎపి విభజన మేరకు పెరగని అసెంబ్లీ సీట్లు
- కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానంలో సిఎం రేవంత్

02



03

## ఓలా, ఊబెర్, ర్యాపిడోల గుత్తాధిపత్యం

- చెక్ పెట్టేందుకు రంగంలోకి కేంద్రం
- త్వరలోనే దేశీయంగా క్యాబ్ సర్వీసులు
- కేంద్రహోంమంత్రి అమిత్ షా వెల్లడి

## స్కాలర్‌షిప్స్, ట్యూషన్ ఫీజుల దరఖాస్తు గడువు మరోసారి పొడిగింపు



04



## అవయవమార్పిడి చట్టాన్ని ఉల్లంఘిస్తే రూ.కోటి జరిమానా

- పది సంవత్సరాల జైలు శిక్ష
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- మానవ అవయవాల మార్పిడి బిల్లుకు ఆమోదం

03

## మృతదేహాల గుర్తించటానికి టన్నెల్ లోపలికి క్యాడవర్ డాగ్స్

03



## నిశ్చితార్థం అయిన తర్వాత బట్టతల ఉందని పెళ్లికి నిరాకరణ

### మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లికి యువతి నిరాకరించడంతో యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఈ విషాదకర ఘటన హైదరాబా ద్‌లో చోటుచేసుకుంది.



04

## సీఎం రేవంత్‌కి లేఖ రాసిన కిషన్‌రెడ్డి

హెచ్‌సీయూసీ భూముల వేలాన్ని విరమించుకోవాలని సూచన



03

## వంద శాతం రుణమాఫీ నిరూపిస్తారా?



- మహిళలకు తులం బంగారం హామీ ఏమైంది?
- దొడ్డువడ్లకు 500 బోనస్ ఎక్కడ పోయింది
- బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి పెట్టింది
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 27 :**

కొండారెడ్డి పల్లి పోదామా.. కొడంగల్ పోదామా..? రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ అయ్యిందని నిరుపిస్తారా..? అంటూ అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఒకవేళ రుణమాఫీ 100 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటానని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ అసెంబ్లీలో సవాల్ విసిరారు. రైతు భరోసా కింద రైతులకు రూ.15 వేలు ఇస్తామని చెప్పలేదా..? మహిళలకు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

మిగతా 2 లో



## ఏక మొత్తంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

### ఎప్పుడెప్పుడు ఎంతెంత చేశారో లెక్కలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 :** తెలంగాణ అప్పులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అప్పులపై లెక్కలతో సహా ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కడిగిపారేశారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాడే నాటికి రాష్ట్ర అప్పు 72,615 కోట్లు-. ఇతర కార్పొరేషన్ల అప్పు రూ.16,900 కోట్లు. ఇతర గ్యారెంటీల కింద తెచ్చిన అప్పులు రూ.5000 వేల కోట్లు.

మిగతా 2 లో

## మనిషికి పంది కాలేయం

చైనా వైద్యుల అరుదైన ఘనత



04




03

## టెన్త్ పేపర్ లీకేజీలో ఇద్దరు అధికారుల సస్పెన్షన్

జనరల్ న్యూస్
GENERAL NEWS

రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

## ఐదేళ్లలో 4,03,664 కోట్ల అప్పులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.89 శాతం నిధులు వస్తున్నాయని, 2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ వెల్లడించింది. రెవెన్యూ రాబడుల్లో 45 సర్కారీ ఉద్యోగుల వేతనాలకు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చవుతోందని నివేదికలో తెలిపింది. 2023-24లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు- రూ49,977 కోట్లుని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.89 శాతం నిధులు వస్తున్నాయని, 2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ వెల్లడించింది. రెవెన్యూ రాబడుల్లో 45??? సర్కారీ ఉద్యోగుల వేతనాలకు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చవుతోందని నివేదికలో తెలిపింది. 2023-24లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు- రూ49,977 కోట్లు-ని స్పష్టం చేసింది. 2023-24లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు రూ.76,776 కోట్లు- చెల్లింపులు జరిగాయని, 11 పెరుగుదల స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం నిధుల పెంపుదలగా చెప్పింది. 2022-24లో ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.53,144 కోట్లు-గా కాగ్ వెల్లడించింది. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని, ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు కాగా, ఇది రూ.1,11,477 కోట్లుగా కాగ్ నివేదికలో వెల్లడైంది.

# కక్షసాధింపు చర్యలు తీసుకుంటే జైల్లో ఉండేవారు

(మొదటిపేజీ తరువాయి)

భారాస మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు- రుణమాఫీ చేసింది. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్లు- మాఫీ చేశారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8,500 కోట్లకు పైగా అయ్యింది. మేం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.26 వేల కోట్లు రుణమాఫీ చేశాం. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకొని రైతుబంధు కూడా వేయలేదు. భారాస ఎగవేసిన రైతుబంధు రూ. 7,625 కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని మాజీ సీఎం స్వయంగా బెదిరించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలు కు రూ.500 బోనస్ ఇచ్చాం అని రేవంత్ తెలిపారు. ప్రాజెక్టుల కోసం పేదల భూములు తీసుకున్న కేసీఆర్.. వాళ్ల బంధువుల భూములు మాత్రం తప్పించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న రైతులు ఆందోళన చేయలేదా? అని ప్రశ్నించారు. 14 గ్రామాల ప్రజలను పోలీసులతో కొట్టించి బలవంతంగా భూసేకరణ చేశారన్నారు. ప్రాజెక్టు వద్ద ఎవరికి భూములు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కాలువలు తీసినట్లు నిరూపిస్తాను. నేను భూసేకరణను వ్యతిరేకించలేదు.. పరిహారం చెల్లించాలని ధర్నాలు చేశాను. కమిషన్ల కోసం ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశారు. రూ.36 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి.. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం చేపట్టారు. కాళేశ్వరం అవినీతి విషయంలో త్వరలోనే వీళ్లు జైలుకు వెళ్తారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చిందని రేవంత్ అన్నారు. అసలు బీఆర్ఎస్‌కు ఉచిత కరెంట్‌తో ఏం సంబంధం.. రాష్ట్రంలో ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. రైతుల ఉచిత కరెంట్ కోసం రూ.33వేల కోట్లు- ఖర్చు చేశాం. బీఆర్ఎస్ పదేళ్లలో చేయని పనులు.. మేం 10 నెలల్లో చేశాం. తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్ర అప్పు రూ.72వేల కోట్లు-. కార్పోరేషన్ అప్పులు కూడా కలిపితే రూ.90 వేల కోట్లు. ఈ పదేళ్లలో అప్పులే రూ.3.50లక్షల కోట్లు దాటింది. మేం అధికారంలోకి వచ్చే నాటికి అప్పు రూ.6.69 లక్షల కోట్లు. ఇతర బకాయిలతో కలిపి రూ.7.05 లక్షల కోట్లు. పెండింగ్ బిల్లులే రూ.40వేల కోట్లు పెట్టిపోయారు. మేం 15 నెలల్లో రూ.1.58లక్షల కోట్ల అప్పు చేశాం. కొత్తగా చేసిన అప్పులో రూ.1.53లక్షల కోట్లు పాత అప్పులకే చెల్లించాం. కాళేశ్వరం పై రూ.70,490కోట్లు అప్పు తీసుకొచ్చారు. కూలిపోయిన ఆ ప్రాజెక్టుకు రూ.5వేల కోట్లకు పైగా చెల్లించాం. గత సీఎం డాక్టర్, ఇంజనీర్, డిజైనర్ నేనే అంటూ కాళేశ్వరం కట్టారు. ఇంజనీర్లు చెప్పినా వినకుండా.. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్ట్ కట్టారు. ఏడో వింత అంటే మూడేళ్లకే పనికిరాకుండా పోయింది. ఇప్పుడు నీళ్లు నిలిపితే కూలుతుందని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో వరి దిగుబడి పెరిగిందని అంటూ కెటిఆర్ పై విరుచుకు పడ్డారు.



## పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

- దేవాదులలో మూడో దశ మోటారును ప్రారంభించిన ఉత్తమ్, పొంగులేటి
- ధర్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుకున్న గోదావరి జలాలు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లివ్వడానికే ప్రాధాన్యం : ఉత్తమ్

**వరంగల్:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లివ్వడానికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే దేవాదుల మూడో దశ మోటారును దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద గురువారం మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఉత్తమ్ లాంఛనంగా ప్రారంభించారు. అక్కడి నుంచి గోదావరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. రిజర్వాయర్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజులతో కలిసి పరిశీలించిన మంత్రులు.. అక్కడ గోదావరి జలాలకు పూజలు చేశారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'రెండున్నర దశాబ్దాలుగా సాగుతున్న దేవాదుల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వేగవంతం చేసింది. మూడు దశల్లో ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల్లోని ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ ఎత్తిపోతల పథకం పనులన్నింటినీ డిసెంబరులోగా పూర్తిచేస్తాం. ప్రస్తుతం ఒక మోటారు ద్వారా నిత్యం 650 క్యూసెక్కుల నీటిని ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి విడుదల చేస్తున్నాం. రానున్న పక్షం రోజుల్లో మరో మోటారును ఆన్ చేసి ఆయకట్టుకు నీళ్లందిస్తాం" అని తెలిపారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన దేవాదులను తమ సర్కారే పూర్తి చేస్తుందని చెప్పారు. అధికారులను మంత్రి ఉత్తమ్ పరుగులు పెట్టించి రైతుల పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు. దేవాదుల మూడో దశ మోటార్‌ను ఆన్ చేయడానికి అధికారులు, ఇంజినీర్లు పది రోజులుగా రేయింబవళ్లు పనిచేశారు. ఆస్ట్రియా ఇంజినీర్లతో కలిసి సాంకేతిక సమస్యలను అధిగమించారు. ఆయిల్ లీకేజీలతో సర్జ్‌పూల్‌లోని గేట్లు మొరాయించడం, విద్యుత్తు హెచ్చుతగ్గులతో మోటార్లు ట్రిప్ కావడం వంటి వాటిని పరిష్కరించి.. గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు మోటారును ఆన్ చేశారు. ప్రభుత్వ నీటిపారుదల శాఖ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి దేవన్నపేట పంప్‌హౌస్‌లోనే మకాం వేసి పరిస్థితులను పర్యవేక్షించారు. ఎట్టకేలకు మోటార్ ఆన్ అయి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి నీళ్లు చేరడంతో శుక్రవారం నుంచి ఆయకట్టుకు నీళ్లివ్వనున్నారు.

## 'పది' విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం

### పాఠశాల విద్యాశాఖ ఆదేశం

**హైదరాబాద్:** పదో తరగతి పరీక్షలు రాసే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అందించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలే పరీక్షా కేంద్రమై.. అక్కడ పరీక్ష రాసే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులుంటే మధ్యాహ్న భోజనం పెట్టి పంపాలని ఆయన ఉత్తర్వులిచ్చారు. కొన్ని చోట్ల ఇతర గ్రామాల నుంచి విద్యార్థులు వస్తారని, వారు ఇంటికి వెళ్లి తినేసరికి ఆలస్యమవుతుంది కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# డీలిమిటేషన్‌తో దక్షిణాదిని లిమిట్ చేసే కుట్ర

- జనాభా ప్రాతిపదికన అంగీకరించే ప్రసక్తి లేదు
- 24 నుంచి 19 శాతానికి పడిపోనున్న దక్షిణాది ప్రాతినిధ్యం
- 11 ఏళ్లయినా ఏపి విభజన మేరకు పెరగని అసెంబ్లీ సీట్లు
- కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానంలో సీఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి 27 :** డీలిమిటేషన్‌తో దక్షిణాదిని లిమిట్ చేయాలన్న కుట్రలో కేంద్రం ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు ఇందుకు దోహదపడుతోందన్నారు. దీనిని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, కేవలం రాష్ట్రం యూనిట్‌గా మాత్రమే సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ..జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 శాతం 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాలను నియంత్రించడానికి నియోజకవర్గాల పునర్విభజనను కేంద్రం వినియోగించుకుంటోంది. రాజకీయాలకు అతీతంగా దీనిపై ఒకే మాటపై నిలబడి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. అందుకే ఇవాళ సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టాం అని సీఎం పేర్కొన్నారు. డీలిమిటేషన్ వల్ల జనాభా నియంత్రణ శాపం కాకూడదన్నారు. డీలిమిటేషన్ వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదని, ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలన్నారు. పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదని, రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని నియోజకవర్గ పునర్విభజన చేయాలన్నారు. అన్ని పార్టీలతో సంప్రదింపుల తర్వాతనే లోక్‌సభ సీట్ల పునర్విభజన చేయాలని సీఎం పేర్కొన్నారు. పునర్విభజన పారదర్శకంగా జరగాలి. జనాభా నియంత్రణ శాపం కాకూడదు. జనాభా వాటా తగ్గిన రాష్ట్రాలు నష్టపోకూడదని అన్నారు. దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి కూడా పునర్విభన 25 ఏండ్లు వాయిదా వేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలనే ఆలోచన సరికాదు. కేంద్రమే నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మంత్రి అంటున్నారు. కేంద్రానికి తెలంగాణసభ నుండి తీర్మానం చేసి పంపాలని నిర్ణయం తీసుకున్నామని శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ మద్దతు తెలపాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం చెడిపోతుందని ఆనాడు ఇందిరా గాంధీ భావించారు. అందుకే చట్టాన్ని సవరించి పునర్విభజన చేశారు. ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన అంశం మళ్లీ చర్చకు రావడంతో దక్షిణాదిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని సిఎం రేవంత్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగేలా కేంద్రం వ్యవహరిస్తే ఖచ్చితంగా మనం ఎదుర్కోవాలి. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేశాయి. ఇకపోతే ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణలో నియోజకవర్గాలను పునర్విభజన చేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మనపై వివక్ష చూపుతోందని 11 ఏళ్లుగా ఈ అంశాన్ని తొక్కిపెట్టిందని అన్నారు. 2026 జనాభా లెక్కింపు తర్వాతే చేపడతామని ఆనాడు పార్లమెంట్లో తాను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.

జమ్మూ కాశ్మీర్లో రాజ్యాంగాన్ని సవరించి 2011 జనాభ లెక్కల ప్రకారం నియోజక వర్గాలను 83 నుంచి 90కి పెంచారు. సిక్కింలో 2018లో కేబినెట్ రిజల్యూషన్ పాస్ చేసి ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ప్రజల ముందుంచేందుకే సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టామని సిఎం అన్నారు. రాజకీయాలకు అతీతంగా పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిద్దాం. అవసరమైతే పోరాటబాట పడుదాం. త్వరలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి, కెకెల ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం నిర్వహిస్తాం. ఈ సమావేశా నికి అందరూ రావాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నిజానికి డీలిమిటేషన్‌పై గందరగోళం నెలకొందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ డీలిమిటేషన్‌పై సమావేశం ఏర్పాటు- చేశామని వివరించారు. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజ నను అంగీకరించ బోమని తీర్మానం చేశామని, జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను దివంగత ప్రధాని వాజ్‌పేయీ కూడా వ్యతిరేకించారని గుర్తు చేశారు. డీలిమిటేషన్‌పై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కొందరు అంటున్నారని, జనాభా నియంత్రణపై కేంద్ర ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలుపాటించాయని, ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించలేదన్నారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అందరూ ఒకే మాటపై ఉండాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలి. అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలి. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించబోమని తీర్మానం చేశారు. జనాభా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌ను వాజ్‌పేయీ కూడా వ్యతిరేకించారు. 24 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయి. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు చాలా తక్కువ వస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌కు మాత్రం కేంద్రం పన్నుల్లో ఎక్కువ వాటా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# వందశాతం రుణామఫీ నిరూపిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

దొడ్డు వడ్లకు కూడా క్వింటాకు రూ.500 వంద బోనస్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు.. కానీ ఎన్నికల తర్వాత మాట మార్చి కేవలం సన్న వడ్లకే ఇస్తామని కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉప్పు - నిప్పులాగా కొట్లాడుకుంటాం.. కానీ చెన్నైలో సీఎం రేవంత్ రెడ్డిని గౌరవించానని, అది నా సంస్కారం అని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి ఒక్కటి చెప్పదలచుకున్నా.. మీరు నేను చెన్నై మీటింగ్‌కు వెళ్లాం. అక్కడ మీరు ఒక ప్రతిపాదన పెట్టారు. నేను మీ పార్టీ వ్యక్తిని కాదు.. ఇక్కడ ఉప్పు నిప్పులాగా కొట్లాడుకుంటాం.. కానీ నేను మిమ్మల్ని గౌరవించి.. మా సీఎం చెప్పిన మాట కరెక్ట్ అని 33 శాతం కాదు 36 శాతం ఇవ్వొచ్చని చెప్పాను. ఎందుకంటే నాకు ఆ సంస్కారం ఉంది. ఎందుకంటే నీవు మా ముఖ్యమంత్రివి కాబట్టి.. హద్దులు, సరిహద్దులు దాటిన తర్వాత నిన్ను కాపాడాలి.. నిన్ను గౌరవించాలి.. అది నా బాధ్యత అని కేటీఆర్ తెలిపారు. అలాగే కేంద్రం చేస్తున్న అక్రమాలపై నిలదీయాల్సిందేనని అన్నారు. గత పదేళ్లుగా బిఆర్ఎస్ హయాంలోనూ కేంద్రంతో సఖ్యతగా ఉన్నా దక్కిందేమీ లేదన్నారు. ఓ స్త్రీ రేపు రా' మాదిరి కాంగ్రెస్ పరిపాలన ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. తెల్లారి లేస్తే ప్రజాపాలన అంటారు. కానీ నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో.. మీ ప్రజా పాలనలో ప్రజాస్వామిక స్ఫూర్తి కూడా అంతే ఉంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్నరు. కానీ అత్తాకోడల్లకు పంచాయతీ పెట్టారు. తులం బంగారం, ఆసరా పెన్షన్ల కోసం అత్తాకోడళ్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అప్పట్లో ఊర్లల్లో గోడల మీద రాసేది ఓ స్త్రీ రేపు రా అని.. ఇవాళ వీళ్ల పరిపాలన కూడా అట్లనే ఉంది. ఏది అడిగినా ఓ స్త్రీ రేపు రా.. మహిళలను కోటీశ్వరులను చేస్తారంటా.. ఎట్ల చేస్తారో తెలియదు కానీ.. 40 శాతం బడ్జెట్‌ను చూసిన తర్వాత ప్రజలకు అర్థమైంది వీళ్ల పాలన అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. రూ. 2500 కోసం ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారు. బంగారం అన్నారు.. లంకె బిందెలు దొరికినక ఇస్తారా..? కేసీఆర్ కిట్ బంద్ అయిపోయింది. న్యూట్రిషన్ కిట్ ఆగిపోయింది. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా బంద్, ఆశాలు, అంగన్‌వాడీ కార్మికులను మోసం చేశారు. ఇంచా చాలా ఉన్నాయి.. -క్రై-మ్ రేట్ పెరిగిపోతోందని డీజీపీనే స్వయంగా చెప్పారు. ప్రోటోకాల్ వయిలేషన్స్ కూడా జరుగుతున్నాయని కేటీ-ఆర్ పేర్కొన్నారు. హరీశ్‌రావు మీద పెట్రోల్ పోసి చంపేస్తా అని కాంగ్రెస్ నాయకుడు అంటడు.. కానీ చర్యలు, కేసులు ఉండవు. కానీ మా మీద కేసులు, చర్యలు ఉంటాయి. ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ, ఐఆర్ పెండింగ్‌లో ఉన్నాయి. ఐఆర్ అంటే ఇప్పట్లో రాదు.. డీఏ అంటే దయచేసి అడగొద్దు.. పీఆర్సీ అంటే పనికి రాని చర్చలు అని ఉద్యోగులు అనుకుంటున్నారు. అలా పరిస్థితి అయిపోయింది. ఓల్డ్ పెన్షన్ స్కీం ఎప్పుడు తెస్తారో చెప్పాలి. వ్యవసాయ విస్తరణ అధికారులను, పోలీసులను సస్పెండ్ చేశారు.. ప్రజాపాలన ఇలా ఉందంటూ కేటీ-ఆర్ తీవ్రంగా విమర్శించారు. ఇక్కడ సభలో అంత ఫ్రస్టేషన్ ఉంటే కుదరదు. రంకెలు వేస్తామంటే కుదరదు. ప్రతిపక్షాల మీద మాటలతోని డైలాగులతో దాడి చేస్తా అంటే కుదరదు. పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు. పరిపాలన అంటే మీరు చెప్పిన కష్టాలన్నీ ఉంటాయి. 2014లో కూడా కష్టాలతోనే ప్రారంభించాం. అన్ని సెట్ చేసుకుంటూ ఇక్కడి దాకా వచ్చాం.. కక్ష సాధింపు లేదని రేవంత్ రెడ్డి అంటున్నారు. మరి ఎందుకు బీఆర్ఎస్ పథకాలు, ప్రాజెక్టులు రద్దు చేశారు. అప్పటికే ఎయిర్‌పోర్టు మెట్రో టెండర్ అయిపోయింది. కానీ కోపంతో రద్దు చేశారు. ఫార్మా సిటీలు వద్దన్నారు.. ఫార్మా విలేజ్‌లు ముద్దన్నారు. ఏమైంది..? కొడంగల్‌లో ఏం జరిగింది. ఈ విషయంలో సీఎంది తప్పు కాదు.. బిజీగా ఉంటారు. లగచర్లలో ఫార్మా విలేజ్ పెట్టాలనుకున్నప్పుడు మీ సోదరుడితోనో.. మీ నాయకులతో మాట్లాడి ఒప్పించి ఉండాల్సిందే. లగచర్ల రైతుల ధర్నాలు, రాస్తారోకోలు పట్టించుకోలేదు. ఆఖరికి అధికారులు పోతే లొల్లి యింది. దాన్ని మాకు అంటగడితే ఎలా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఎవరు ఏమనుకున్నా సరే.. తెలంగాణ జాతిపిత కచ్చితంగా కేసీఆరే.. బూతుపిత రేవంత్ రెడ్డినే అవుతారు అని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎవరో ఏకే47 గురించి చెప్పారు. ఎవరో కాల్చి చంపారంట..? ఏకే47 తో పాటు తుపాకుల గురించి ఆయనకు తెలిసినంత మాకు తెల్వది. తెలంగాణ ఉద్యమంలో ప్రజల మీదకు తుపాకి తీసుకుపోయిన రైఫిల్ రెడ్డి ఆయన. అసలు ఎవరు ఎవర్ని చంపి అధికారం లాక్కున్నారు..? పాపం పాత కాంగ్రెసోళ్లను అందర్నీ ఖతం చేసి ఆయన పదవి లాక్కుని ఇవాళ మమల్ని అంటే ఎలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ రైజింగ్ అంట.. అట్టర్ ఫ్లాప్ సినిమాకు అట్టహాసంగా శత దినోత్సవం చేసినట్ట- విఫల పాలనకు విజయోత్సవాలు నిర్వహించారు. అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఏక మొత్తంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

(మొదటిపేజీ తరువాయి)

ఇవి మొత్తం కలిపి రూ.90,161 కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని బీఆర్ఎస్‌కు అప్పగించాం. 2023లో మళ్లీ మేం అధికారంలోకి వచ్చేనాటికి ఉన్న అప్పులు రూ.6.69 లక్షల కోట్లు-. ఇతర బకాయిలతో కలిపి తెలంగాణ అప్పులు రూ.7.05 లక్షల కోట్లు' అని సీఎం రేవంత్ రెడ్డి లెక్కలతో సహా వివరించి బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టారు. దివాళా తీసిన రాష్ట్రాన్ని మాకు అప్పగించి వెళ్లారని ఫైర్ అయ్యారు. మేం అధికారంలోకి వచ్చాక 15 నెలల్లో రూ.1.58 వేల కోట్లే అప్పు చేశాం. అందులో బీఆర్ఎస్ చేసిన అప్పులకే సగం మిత్తీలు కట్టామన్నారు. రాష్ట్ర అప్పులకు మిత్తీలు కట్టేందుకే రూ.6లక్షల కోట్లు- తేవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మీరు చేసిన అప్పులు, తప్పులకు రాష్ట్రం శిక్ష అనుభవించాల్సి వస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ చేసిన రైతు రుణమాఫీపైన సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఏకమొత్తంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామన్నారు.. ఎన్నికలయ్యాక రుణమాఫీకి ఐదేళ్లు పట్టింది.. రెండోసారి రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు చేయలేదని.. తీరా ఎన్నికల ముందు చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్లలో 21 లక్షల మంది రైతులకు రూ.16,908 కోట్లు- రుణమాఫీ చేశారు. కానీ, మేం 25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్లు-.. రెండు లక్షల చొప్పున రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. వాళ్లు పదేళ్లలో చేసిన దానికంటే మేం పది నెలల్లోనే ఎక్కువ చేశామని.. ఎన్నికల సమయంలో వాళ్లు ఎగ్గొట్టిన రైతు బంధు కూడా మేమే ఇచ్చామని అన్నారు. వాళ్లు పదేళ్లలో చేయలేని పనులను 10 నెలల్లోనే మేం చేస్తే ఓర్వలేక కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు.

### అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

**హైదరాబాద్:** రాష్ట్రంలోని అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అర్చక ఉద్యోగ ఐకాస ఛైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరు కృష్ణమాచారి, కన్వీనర్ రవీంద్రాచార్యులు, బద్రీనాథ్, చంద్రశేఖర్‌శర్మ తదితరులు గురువారం సీఎంను శాసనసభ ప్రాంగణంలో కలిసి ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం తెలంగాణ అర్చక ఉద్యోగ ఐకాస రూపొందించిన విశ్వావసు నామ సంవత్సర డైరీని సీఎం ఆవిష్కరించారు. అనంతరం వారు తమ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయగా.. సానుకూలంగా స్పందించారు. వారితో ఎమ్మెల్యేలు ఎన్.రాజేందర్‌రెడ్డి, రాంచంద్రునాయక్ ఉన్నారు. పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సీఎంను శాసనసభ ప్రాంగణంలోని ఆయన కార్యాలయంలో ఆ వర్సిటీ వీసీ జ్ఞానప్రకాశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పశువైద్య విశ్వవిద్యాలయ ప్రగతి, కొడంగల్‌లో నిర్మించనున్న కొత్త పశు వైద్య కళాశాల తదితరాల గురించి ఈ సందర్భంగా వారు చర్చించారు. విశ్వవిద్యాలయంలో విస్తృతస్థాయిలో పరిశోధనలు జరగాలని, రైతులకు వాటి ఫలాలు అందించాలని వీసీకి సీఎం సూచించారు.

## 'విద్యుత్ బిల్లు చెల్లించాలని వచ్చే కాల్స్‌ను నమ్మొద్దు'

**హైదరాబాద్:** విద్యుత్ బిల్లు బకాయిలు ఉన్నాయని, వెంటనే చెల్లించాలంటూ వస్తున్న మోసపూరిత ఫోన్‌కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దు అని ప్రజలకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. బిల్లు కట్టకుంటే రాత్రిపూట కరెంటు సరఫరా నిలిపివేస్తామని, వెంటనే సంప్రదించాలని సైబర్ నేరస్థులు ఓ మొబైల్ నంబర్‌ను పంపుతున్నారని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. "విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఎప్పుడూ ఇలా ఫోన్ నంబరును గానీ, లింకును గానీ పంపదు. మెసేజ్‌లు, లింకులను నమ్మి, సంప్రదించిన వారి బ్యాంకు ఖాతాలు, డెబిట్ కార్డు వివరాలను సైబర్ నేరస్థులు తీసుకుని నగదు తస్కరిస్తూ మోసగిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ప్రజలు ఇలాంటి వాటిని నమ్మి మోసపోవద్దు' అన్నారు.


## బాలికల గురుకులాల్లో మహిళా సిబ్బందే ఉండాలి

### ఆదేశాలు జారీచేసిన ఎస్సీ సొసైటీ కార్యదర్శి

**హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎస్సీ బాలికల గురుకులాలు, కళాశాలల్లో అన్ని కేటగిరీల పోస్టుల్లో మహిళా సిబ్బంది ఉండాలని ఎస్సీ గురుకుల సొసైటీ స్పష్టం చేసింది. ఈ మేరకు గతంలో సాధారణ పరిపాలనశాఖ జారీచేసిన జీవో నం.1274 ఉత్తర్వులు యథావిధిగా అమలు చేయాలని ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి వర్షిణి ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ సబార్డినేట్ సర్వీసు నిబంధనల్లోని రూల్ 22(ఏ)(3) ప్రకారం బాలికల పాఠశాలలు, విద్యా సంస్థల్లో అన్ని పోస్టుల్లో మహిళా సిబ్బందిని మాత్రమే భర్తీ చేయాలని పేర్కొన్నారు. బాలుర పాఠశాలలు, విద్యాసంస్థల్ని జనరల్‌గా పరిగణిస్తూ అందులోని పోస్టులను మహిళలు, పురుషులతో భర్తీ చేస్తామని సొసైటీ పేర్కొంది. బాలికల పాఠశాలలు, బాలుర పాఠశాలలకు ప్రత్యేక రోస్టర్‌ను నిర్వహించాలని సూచించింది. ఎస్సీ గురుకుల సొసైటీలో మల్టీజోనల్ అధికారులు, జోనల్ అధికారులు, జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు ఈ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎక్కడైనా బాలికల పాఠశాలలు, విద్యాలయాల్లో పురుష సిబ్బంది ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

# ఓలా, ఊబెర్, ర్యాపిడోల గుత్తాధిపత్యం

- చెక్ పెట్టేందుకు రంగంలోకి కేంద్రం
- త్వరలోనే దేశీయంగా క్యాబ్ సర్వీసులు
- కేంద్రహోంమంత్రి అమిత్ షా వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 27 :** ప్రస్తుతం దేశంలో గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి కంపెనీలకు చెక్ పెట్టేందుకు కేంద్రం సన్నద్ధం అవుతోంది. పబ్లిక్‌ట్రాన్స్ పోర్ట్ కేటగిరీలో సేవలను అందిస్తున్న ఈ కంపెనీలు ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతున్అయి. ఆన్‌లైన్ క్యాబ్ బుకింగ్ సేవల వ్యాపారంలో ఇవి గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న సంగతి తెలిసిందే. ఇవి ప్రజల నుంచి అధికంగా రేట్లు- వసూలు చేయటం నుంచి డ్రైవర్లకు తక్కువ చెల్లింపు వరకు అనేక ఆరోపణలను సైతం అందుకుంటు-న్న సంగతి తెలిసిందే. అయితే తాజగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా వీటి గుత్తాధిపత్యానికి బ్రేక్ వేసే అతిపెద్ద ప్రకటన గురించి పార్లమెంటుకు వెల్లడించారు. మోదీ సర్కార్ రానున్న కొద్ది నెలల్లో క్యాబ్ సేవలను ఓలా, ఉబెర్ తరహాలోనే స్టార్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తోందని వెల్లడించారు. ఇందుకోసం సహకార టాక్సీ ఎ÷-లాట్ ఫారమ్ అందుబాటు-లోకి తీసుకొస్తున్నట్లు- ప్రకటించారు. ప్రజలు తమ టూవీలర్స్, త్రీవీలర్స్, ఆటోలు, కార్లను ఇందులో నమోదు చేసుకోవటం ద్వారా ప్రయోజనం పొందవచ్చని పార్లమెంటు-లో ప్రకటించారు. ఈ సహకార టాక్సీ ప్లాట్ ఫారమ్ నుంచి వచ్చే లాభాలు నేరుగా రిజిస్టర్ చేసుకున్న డ్రైవర్లకు వెళతాయని ఆయన అన్నారు. ఈ ప్రకటన ప్రైవేటు సర్వీస్ ఓలా, ఉబెర్, ర్యాపిడోలకు నిద్రలేకుండా చేస్తోంది. ఇప్పటికే ఓఎన్డీసీ వంటి ఓపెన్ ఫ్లాట్ ఫారమ్ ఆధారంగా బెంగళూరు, దిల్లీ, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన మెట్రో నగరాల్లో వివిధ యాప్స్ సదరు దిగ్గజ కంపెనీల పోటీ- ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థ రంగంలోకి దిగితే పోటీ- మరింత పెరుగుతుందని తెలుస్తోంది. కానీ ప్రజలకు దీని వల్ల మెరుగైన సేవలు తక్కువ ధరలకు లభించే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఇదే క్రమంలో కేంద్రం త్వరలోనే అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీని కూడా సహకార సంఘాల ఆధారంగా స్టార్ట్ చేయాలనే ప్రణాళికలను రచిస్తోందని అమిత్ షా వెల్లడించటం ప్రైవేటు- బీమా కంపెనీలను కుదిపేస్తోంది. ఓలా ఉబెర్ వంటి పెద్ద కార్పొరేట్ల హవాను రెయిడ్ హెయిలింగ్ వ్యాపారంలో నివారించటానికి ప్రయత్నాలు దీనికి ముందు 2017లోనే దిల్లీలో స్టార్ట్ అయ్యాయి. ఇందులో భాగంగా దిల్లీలోని టాక్సీ డ్రైవర్లు ప్రత్యేకంగా సేవా క్యాబ్ పేరుతో ముందుకొచ్చారు. ఇదే తరహా చర్యలు కేరళ రాష్ట్రంలోనూ కనిపించాయి. అయితే ఇవి పెద్ద కార్పొరేట్లను ఎదుర్కొని నిలబటంలో సఫలం కాలేకపోయాయి. అయితే కేంద్ర హోం మంత్రి ప్రకటించిన కొత్త యాప్ వీటి ఆధిపత్యాన్ని తట్టుకుని నిలబడుతుందా లేక మట్టికరుస్తుందా అనే అంశం వేచి చూడాల్సిన విషయం. అయితే బెంగళూరు కేంద్రంగా స్టార్ట్ అయిన ఓఎన్డీసీ ఫ్లాట్ ఫారమ్ నమ్మ యాత్రి మాత్రం కొచ్చి, కలకత్తా, మైసూరు, హైదరాబాద్ వంటి నగరాలకు విస్తరించి ముందుకు సాగుతోంది.



## అవయవమార్పిడి చట్టాన్ని ఉల్లంఘిస్తే రూ.కోటి జరిమానా

- పది సంవత్సరాల జైలు శిక్ష
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- మానవ అవయవాల మార్పిడి బిల్లుకు ఆమోదం

**హైదరాబాద్:** మానవ అవయవ మార్పిడి చట్టాన్ని ఉల్లంఘిస్తే ఇకపై కఠిన చర్యలు ఉంటాయని, వాణిజ్యపరంగా దాన్ని వినియోగించుకుంటే కోటి జరిమానా, పదేళ్ల జైలుశిక్ష విధించేలా మార్పులు చేశామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. గతంలో రూ.5 వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష ఉండేదన్నారు. శాసనసభ, శాసనమండలిలో గురువారం తెలంగాణ మానవ అవయవాల మార్పిడి బిల్లు-2025ను ప్రవేశపెట్టగా... ఆమోదం లభించింది. ఉభయ సభల్లో మంత్రి మాట్లాడుతూ... "జీవనశైలి, ఆరోగ్య ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు అవసరం. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అవయవ మార్పిడిలో మాఫియాను నియంత్రించాల్సిన అవసరముంది. ఈ చట్టంతో రాష్ట్రంలో వైద్య పర్యాటకం సైతం పెరుగుతుంది. దేశంలో ఎక్కడి నుంచైనా అవయవదానం పొందడానికి ప్రత్యేక పోర్టల్‌లో చేరాం. గుండె, కిడ్నీ, కాలేయం వంటి అవయవాలతోపాటు చర్మం, ఎముక మజ్జ, రక్తనాళాలు లాంటి వాటిని చట్ట పరిధిలోకి తెచ్చాం" అని పేర్కొన్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### హెచ్‌సీయూసీ భూముల వేలాన్ని విరమించుకోవాలని సూచన

**హైదరాబాద్, మార్చి 27 :** హెచ్‌సీయూ వద్ద ప్రభుత్వానికి దక్కిన 400 ఎకరాల భూమిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. ఈ భూములను వేలం వేయొద్దని సూచించారు. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూముల వేలాన్ని విరమించుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. గతంలో ప్రభుత్వ భూముల విక్రయాన్ని రేవంత్ రెడ్డి వ్యతిరేకించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వం భూమి అని దీనికి హెచ్‌సీయూకి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో ప్రకటించారు. ఈ భూమిలో ఎలాంటి బఫెలో లేక్ , పికాక్ లేక్ లాంటివి లేవని స్పష్టం చేశారు. రాతి నిర్మాణాలు, పుట్టగొడుగు ఆకారపు అపురూపమైన రాయిని గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బడ్జెట్ డిస్కషన్ సందర్భంగా ఈ గచ్చిబౌలిలో వివాదాస్పద భూమిపై మాట్లాడారు. అక్కడ ఐటీ, ఇతర పరిశ్రమలు వచ్చేలా చేస్తున్నామని తెలిపారు. అక్కడ రిజర్వ్? ఫారెస్ట్ లేదని జింకలు, పులులు, సింహాలు లేవని తెలిపారు. కానీ అక్కడ కొన్ని గుంట నక్కలు చేరి ఇలా ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. దానిని డెవలప్‌మెంట్‌కు వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. గుట్టుగా ఎవరికీ కట్టబెట్టలేదని ఓపెన్ ఆక్షన్ ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. యూనివర్సిటీ పిల్లలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి సంబంధించి విషయాల్లో భూసేకరణ చేస్తే అడ్డంకులు సృష్టించొద్దని సూచించారు.

## ఎసిబికి చిక్కిన విద్యుత్ అధికారి

### లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హైదరాబాద్, మార్చి 27 :** అవినీతి అధికారులను ఎసిబి అధికారులు దాడులు నిర్వహిస్తూ కటకటాల్లోకి నెడుతున్నా వారి తీరు మారడం లేదు. ఎసిబి అధికారులు దాడుల్లో మరో విద్యుత్ శాఖ అవినీతి అధికారి కటకటాల పాలయ్యాడు. జీడిమెట్ల డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ ఎస్ సురేందర్ రెడ్డి దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్‌లో పని చేస్తున్నాడు. దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బౌరంపేటకు చెందిన ఓ వ్యక్తి కి సంబంధించిన 11 కెవి లైన్ షిఫ్టింగ్ కోసం ఎస్టిమేషన్ వేసేందుకు 30 వేలు రూపాయల లంచం ఆశించడంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదుతో గురువారం 2:45 నిమిషాలకు అవినీతి నిరోధక శాఖ సిటీ- రేంజ్ యూనిట్-2 డిఎస్పీ పి.శ్రీధర్ నేతృత్వంలో డి.పోచంపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో దాడులు నిర్వహించిన ఎసిబి అధికారులు బాధితుని దగ్గర నుండి 30 వేలు లంచం తీసుకొని కుడి చేతి ద్వారా ప్యాంట్ జేబులో పెట్టుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సదరు ఏఈ సురేందర్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. అతనిని అరెస్ట్ చేసిన అధికారులు విచారణ నిమిత్తం నాంపల్లి ఎసిబి కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా ఎసిబి అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం రహస్యంగా ఉంచుతామన్నారు.

## పరిశ్రమల స్థాపనను అడ్డుకుంటున్న విపక్షం

### అసెంబ్లీలో సభ్యుల తీరుపై మండిపడ్డ శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మార్చి 27 :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల చివరి రోజున సభలో తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో మాట్లాడుతూ, ప్రతిపక్షాలు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని రూపొందించే ప్రయత్నంలో ప్రభుత్వంపై అవరోధాలు సృష్టించేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల ఘటనపై శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఆ ఘటన వెనుక బీఆర్ఎస్ నేతలే ఉన్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను రెచ్చగొట్టి భూసేకరణను అడ్డుకున్నారని అన్నారు. ఫార్మా పరిశ్రమల ద్వారా వేలాది ఉద్యోగాలు లభిస్తాయని తెలిసినా, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేందుకు ప్రతిపక్షాలు అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకుంటు-న్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంపై ప్రతిపక్ష కాంగ్రెస్ హయాంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒకదాని తర్వాత ఒకటి నెరవేర్చుతున్నామని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించడం విడ్డూరంగా ఉందని శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కుదరకుండా ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు. అసెంబ్లీలో మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఈ అంశంపై స్పందిస్తూ, బీఆర్ఎస్ హయాంలో ఫార్మాసిటీ కోసం రైతుల భూములను బలవంతంగా లాక్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఒకేచోట 144 ఫార్మా కంపెనీలను స్థాపిస్తామని చెప్పిన బీఆర్ఎస్, ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. అయితే అప్పటి ప్రతిపక్ష నేతలుగా తాము ఫార్మాసిటీ-కి వ్యతిరేకంగా పోరాటం చేయలేదని కూడా ఆయన స్పష్టంగా తెలిపారు.

## లీకేజీ గురించి ప్రశ్నిస్తే కేసులు పెడతారా

### బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్




**హైదరాబాద్, మార్చి 27 :** లీకేజీ కుంభకోణం నుంచి తప్పించుకోవడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మళ్లీ తన అలవాటు- ప్రకారం అడ్డదారులు తొక్కుతున్నారని బిఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. పదవ తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీని ప్రశ్నిస్తే కేసులు పెడతారా..అని నిలదీశారు. లీకేజీ మాఫియాకు, కాంగ్రెస్ నాయకులకు ఉన్న సంబంధాలను ప్రజలకు చెప్పడం నేరమా..? అని అడిగారు. కెటిఆర్ దళితులను ఏమన్నారు.. ఎక్కడ ఎవరిని దూషించారని అట్రాసిటీ- కేసు పెట్టారు..? అని నిలదీశారు. ఆయనకు నిందితుల కులం తెలిసే అవకాశముందా..? అని అడిగారు. పదవ తరగతి విద్యార్థుల్లో ఎస్సి, ఎస్టిలు లేరా.. వారికి జరిగిన అన్యాయంపై కెటిఆర్, క్రిషాంక్ మాట్లాడకూడదా..? అని ప్రశ్నించారు. 80 మంది గురుకుల విద్యార్థుల ప్రాణాలు తీసిన రేవంత్ ప్రభుత్వంపైనా, ఎస్సి సబ్ ఎ÷-లాన్ నిధులను పక్కదారి పట్టించినందుకు, యాదాద్రిలో ఉప ముఖ్యమంత్రిని అవమానించినందుకు, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని గేట్లు- మూసి బంధించినందుకు, అసెంబ్లీ స్పీకర్‌ను దళితుడని అవమానించినందుకు సిఎం రేవంత్ రెడ్డి పైన కేసు నమోదు చేయాలని అన్నారు. చేవెళ్ల, ఇంద్రవెల్లిలో దళితులను మోసం చేసిన రాహుల్ గాంధీ, రేవంత్‌పై కేసు పెట్టాలని పేర్కొన్నారు. లగచర్లలో గిరిజన భూములను కబ్జా చేసిన తిరుపతి రెడ్డిపైనా, గ్రూప్ 1, 2లో వర్గీకరణ హామీ ఇచ్చి మోసం చేసిన రేవంత్‌పైనా అట్రాసిటీ- కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించడం కూడా చేతకాలేదని ఆరోపించారు. పోలీసులు, అధికారులు ఉండగా నిందితుడు పరీక్ష కేంద్రంలోకి ఎలా వెళ్లారని, జిరాక్స్ సెంటర్లు ఎలా తెరిచాయని అడిగారు. ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో వైరల్ అయ్యే వరకు ఇంటలిజెన్స్ ఏం చేసింది..? అని నిలదీశారు.కెటిఆర్, క్రిశాంక్, దిలీప్ కొణతంపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## అవయవదానంతో ఎందరి జీవితాల్లో వెలుగులు : కేటీఆర్



**హైదరాబాద్, మార్చి 27 :** అవయవదానంతో ఎందరో జీవితాలతో వెలుగు నింపవచ్చునని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. పిల్లలకు అవయవదానంపై చిన్ననాటి నుంచే అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తే రాబోయే కాలంలో మంచిఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. అవయవదానానికి తాను సిద్ధంగా ఉన్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శాసనసభలో అవయవదానం బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో ప్రవేశపెట్టారు. బిల్లుపై జరిగిన చర్చలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవయవ దానానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ప్రజాప్రతినిధులు అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. నియోజకవర్గాల్లోనూ అవయవదానంపై చైతన్యం తేవాలని చెప్పారు. ప్రజలకు అవయవదానంపై అవగాహన కల్పించాలని తెలిపారు. సభ్యులు ముందుకు వస్తే అసెంబ్లీలోనే సంతకాలు చేద్దామన్నారు. అవయవదానంపై మొదటి సంతకం తానే చేస్తానని వెల్లడించారు. అవయవదానం గొప్ప మానవీయ చర్య అని, మరింత మందికి జీవితాన్నిస్తుందని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో లోపించిన శాంతిభద్రతలు

### న్యాయవ్యవస్థను కించపర్చేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు : పాడికౌశిక్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 27 :** రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని, ఎప్పుడు ఎక్కడ ఏదోఒకటి జరుగుతుందని వీటిని అదుపు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం చెందిందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి న్యాయ వ్యవస్థను అవమానించేలా మాట్లాడారని మండిపడ్డారు. శాసనసభ ఆవం-ణలోని మీడియా పాయింట్ వద్ద పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడారు. తనపై కోపం ఉంటే తన నియోజకవర్గ రైతులను వేధించొద్దన్నాని సూచించారు. కేసీఆర్ పాలనతో ప్రతి ఎకరాకు నీరు అందిందని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీని బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చిన్నచిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తలేరని వెల్లడించారు. తన ఇంటిపైన దాడి చేసిన వారిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఏడు నెలలైనా ఒక్కరి మీద కూడా యాక్షన్ తీసుకోకపోవడం బాధాకరమన్నారు. నిర్లక్ష్యం వహించిన పోలీసు ఉన్నతాధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. హత్యా మత్నం కేసు నమోదు చేసినా ఇంత వరకు అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్తే తనపైనే కేసు పెడతా అని డీసీపీ బెదిరించారని చెప్పారు. సభలో తాము అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతున్నదని కుత్బుల్లా పూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కాంగ్రెస్, బీజేపీ మైత్రీ బంధం సభ సాక్షిగా మరోసారి బయటపడిందని చెప్పారు.

## మృతదేహాల గుర్తించటానికి టన్నెల్ లోపలికి వెళ్లిన క్యాడవర్ డాగ్స్



**మహబూబ్‌నగర్, మార్చి 27 :** దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో క్యాడవర్ డాగ్స్ మృతదేహాల ఆచూకీని గుర్తించడానికి మరోసారి లోపలికి వెళ్లాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం నేపథ్యంలో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటిని నియమించింది. ఆయన ఇక్కడనే ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఆయన సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 రోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయక బృందాలు నిరంతరాయంగా కృషి చేస్తున్నాయని, రోజుకు మూడు షిఫ్టులుగా 600 మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. సహాయక బృందాల మధ్య సమన్వయంతో టన్నెల్‌లో ఉన్న మట్టి, టీబీఎం భాగాలు, ఊట నీటిని తొలగిస్తూ సహాయ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. వెలువడిన వ్యర్థ పదార్థాలను లోకో ట్రైన్ ద్వారా తరలించడంతో పాటు, అధిక సామర్థ్యం గల పంపుల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నట్లు వివరించారు. సహాయక సిబ్బందికి అవసరమైన ఆహారం, వసతి, ఆరోగ్య సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు కేరళకు చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్‌ను గురువారం ఉదయం 11 గంటలకు టన్నెల్‌లోకి పంపినట్లు శివశంకర్ వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, మేజర్ డాక్టర్ విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్ కుమార్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి ఎన్.చంద్ర, హైడ్రా అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులు, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, క్యాడవర్ డాగ్ ప్రతినిధి బృందం తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా 14 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల మంజూరు

### ఏప్రిల్ 1 నుంచి ప్రారంభానికి ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 27 :** కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు లైన్ క్లియర్ అయ్యింది. తెలంగాణలో ఏప్రిల్ 1 నుంచి 14 పోలీస్ స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. కొత్తగా ఏర్పాటు కానున్న 14 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో హైదరాబాద్‌లో13, వరంగల్ అర్బన్‌లో ఒక స్టేషన్ ఏర్పాటు- చేయనున్నారు. 2020లో 14 కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు జరిగాయి. కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల విభజన, ప్రాంతాలు, బదలాయింపు పనులన్నీ ప్రస్తుతం పూర్తయ్యాయి. దీంతో కొత్త స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వి, ఎక్సైజ్ శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ ఆమోద ముద్ర వేశారు. కొత్త పోలీస్ స్టేషన్లను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు.. ఆయా డిప్యూటీ కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్లకు అద్దె భవనాలను గుర్తించాలని కమిషనర్ అదేశాలు ఇచ్చారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు బంజారా హిల్స్, చిక్కడ్‌పల్లి, గండిపేట్, కొండపూర్, పెద్ద అంబర్‌పేట్ , కూకట్‌పల్లి, అమీన్‌పూర్, హసన్‌పర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు అద్దె భవనాల గుర్తింపు పూ-ర్తయింది. అద్దె భవనాలు లభించని మారేడ్‌పల్లి, మీర్‌పేట్, కొంపల్లి, కాప్రా, నాచారం, అల్వాల్ కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు.. ప్రస్తుతం ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలోని ప్రత్యేక గదుల్లో ఏర్పాటు కానున్నాయి.

## టెన్త్ పేపర్ లీకేజీలో ఇద్దరు అధికారుల సస్పెన్షన్

**కామారెడ్డి, మార్చి 27 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరీక్షా పత్రం లీకేజీ ఘటనలు చోటు-చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. లీకేజీలు మాత్రం ఆగడం లేదు. తాజాగా బుధవారం కూడా కామారెడ్డిలో లీకేజీ ఘటన చోటు-చేసుకుంది. జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాలలో సిబ్బంది పరీక్షా పత్రంలోని కొన్ని ప్రశ్నలను లీక్ చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా పత్రం లీకేజీ అయింది. పరీక్షకు కొన్ని నిమిషాల ముందు సిబ్బంది కొందరు ప్రశ్నలను కాగితంపై రాసి బయటకు పంపారు. ఆ ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు. జుక్కల్ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సునీల్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ భీం, ఇన్విజిలేటర్ దీపికపై సస్పెన్షన్ వేటు వేశారు.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక

**సంపాదకీయం**

# వ్యవసాయ సంక్షోభ సవాళ్లు !



వ్యవసాయాభివృద్ధికి ఎంతచేసినా తక్కువే. ధాన్యం పండిస్తున్న రైతన్నలను కాపాడుకుంటేనే మనకు నోట్లోకి ముద్దపోతుంది. కార్పోరేట్ కంపెనీలను మించి వారికి రాయితీలు ఇవ్వడం కూడా మంచిదే. వ్యవసాయికంగా దేశాన్ని బలోపేతం చేస్తే..అనుబంధరంగాలను ప్రోత్సహిస్తే దేశంలో ఆకలిచావులు ఉండవు. ధాన్యానికి కొదవ ఉండదు. పండిన పంటలను తక్కువ ధరలకు ప్రజలకు అందించేలా కూడా కార్యాచరణ ఉండాలి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాలు కలిసి వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి బృహత్ ప్రణాళిక రచించాలి. వ్యవసాయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. సబ్సిడీలు అందిస్తున్నారు. ధాన్యం సజావుగానే కొంటున్నామని అంటున్నారు. పాలకులు, ప్రతిపక్ష నేతలు రైతుజపం చేస్తున్నా వారి జీవితాలు మాత్రం బాగుపడడం లేదు. నిరతంర ఉచిత విద్యుత్ ఇస్తున్న తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా ఇస్తామని అప్పట్లో కెసిఆర్ ప్రకటించారు. అయితే ఇదొక్కటే సరిపోదు. నదుల అనుసంధానం ద్వారా ముందుగా నిరంతరంగా నీటి సరఫరా జరగాలి. ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలి. పండించిన పంటలను సక్రమంగా కొనుగోలు చేయాలి. పంటలు కొనుగోల చేయకుండా ఉచిత విద్యుత్,నీటితీరువా రద్దు, రైతుభరోసా వంటి కార్యక్రమాలు అమలు చేసినా లాభం లేదు. ఇకపోతే ఉచిత విద్యుత్ ఇస్తున్న కారణంగా...సరఫరాకు తగ్గట్లుగా ఉత్పత్తి కూడా ముఖ్యమే. దేశంలో సరిపడా విద్యుత్ ఉందా లేదా అన్న ఆలోచన చేయాలి. ఉత్పత్తి అవకాశాలు పెంచుకోవాలి. సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే విద్యుత్ సమృద్ధిగా లభ్యత కాగలదు. అనేక గ్రామాలకు, ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదు. అలాంటప్పుడు పంపిణీతో పాటు, లభ్యత కూడా సవాల్ కానుంది.

ముందుగా దేశంలో నిరంతర విద్యుత్ ఉత్పత్తి కోసం కృషి జరగాలి. ఉన్న విద్యుత్‌ను ఇప్పుడు సరఫరా చేయడానికే సరిపోదు. విద్యుత ఉత్పాదకత పెంచకుండా ఉచిత విద్యుత్ సాధ్యం కాదని కూడా పాలకులు తెలుసుకోవాలి. అయితే రైతుల ఆత్మహత్యలపై నివేదికలను పట్టించుకోవడం లేదు. అధికశాతం ప్రజల జీవనాధారమైన వ్యవసాయరంగం పట్ల, రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ బిల్లుకు నడుం బిగించిన కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ అంతా ఇక కేంద్రం చేతిలోకి వెళితే రాష్ట్రాలపై విద్యుత్ భారం తడిసి మోపెడు కానుంది. వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటు న్నామని, అగ్రి బేస్డ్, ప్రాసెసింగ్ పై దృష్టి పెట్టామని, వంటనూనె గింజల ఉత్పత్తిపైనా ప్రధాని మోడీ గతంలో చేసిన ప్రకటన ఎలాంటి పురోగతి సాధించలేదు. ఎందుకంటే ఏడున్నరేళ్లుగా ఈ రంగంలో మార్పులు ఉంటే అన్నధాన్యాల ధరలు దిగి రావాలి. కానీ అలాంటిదేమీ లేదు. నిజానికి రైతులు ఉద్యమించడం వల్ల..మోడీ సాగుచట్టాలను ఉపసంహరించు కున్నారు. ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు సాగక రైతులు ఆందోళనకు గురవుతున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదు. ఇంతకన్నా నిర్లక్ష్యం మరోటి ఉండదు. ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతులు కాడి దించితే మనకు కడుపులో ముద్దకూడా దిగదని గుర్తించాలి. ఈ కార్పోరేట్ల ఉత్పత్తులు మన ఆకలి తీర్చవని తెలుసుకోవాలి. రైతులకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. ఇలాంటి సందర్భంలో రైతులకు మేలు చేయాలనుకుంటే సాగుచట్టాలపై విస్తృతంగా దేశవ్యాప్తంగా కాకున్నా కనీసం పార్లమెంటులో చర్చ సాగేది.

నిజానికి దేశంలో నూనెగింజల ఉత్పత్తి పెరిగితే నూనెధరల పెరుగుదల జరిగేది కాదు. అందుకే వ్యవసాయ రంగం పురోగమించ డానికి తీసుకుంటున్న చర్యలు మాత్రం గొప్పగా లేవనే చెప్పాలి. ప్రధానంగా దిగుబడులు తీవ్రంగా దెబ్బతీస్తున్నా వాటిని నిరోధించి, దేశీయంగా వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడంలో కేంద్రం విఫలం అవుతోంది. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, గిట్టుబాటు ధరలు కల్పించడం వంటివన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. దేశంలో వ్యవసాయరంగం అత్యంత సంక్షోభంలో కూరుకుని పోయి ఉన్న సమయంలో ఈ భారీ దిగుమతులు జరగడం గమనార్హం. చెప్పాలంటే, ఇంత భారీ మొత్తం దిగుమతుల కోసం ఖర్చు చేయకుండా, భారతీయ రైతారగంపై ఖర్చు చేసి ఉంటే పరిస్థితి ఎంతోకొంత మెరుగుపడి ఉండేది. అన్ని ప్రభుత్వాలూ రైతన్నను ఆదుకోవడం గురించీ, వ్యవసాయాభివృద్ధి గురించీ గొప్ప ఉపన్యాసాలు, హామీలు ఇవ్వడంతోనే సరిపెడు తున్నాయనే విషయం వాస్తవ పరిస్థితులను గమనించినప్పుడు అర్థం అవుతుంది. కేవలం ఒక్క సంవత్స రంలోనే దేశీయ వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్‌కన్నా మూడు రెట్లు ఎక్కువగా ఆహార ధాన్యాలను మనం దిగుమతి చేసుకున్నామంటే, మన నేతలు ఆ రంగం పట్ల ఎంత శ్రద్ధ పెడుతున్నారో అర్థమవుతుంది. హరిత విప్లవం నుంచి లబ్ధిపొంది, ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించిన దేశం ఇప్పుడు ఆ ఫలాలను నిర్లక్ష్యంగా జారవిడుచుకుంటూ, ఆహార ధాన్యాల దిగుమతిదారు అవుతోంది. పసుపు విప్లవాన్ని అది కావాలని ధ్వంసం చేసిన కారణంగా ఏర్పడిన ఫలితాల నుంచి మనం ఎలాంటి పాఠాలనూ నేర్చుకోలేదు. వంట నూనెల విషయంలో ఈ విప్లవం కారణంగా స్వయం సమృద్ధి సాధించిన మనం దశలవారీగా దిగుమతి సుంకాన్ని దాదాపుగా సున్నాకు దించిన నేపథ్యంలో మార్కెట్లోకి దిగుమతి ఉత్పత్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి. వంట నూనెలు 60 శాతం దిగుమతి చేసుకుంటున్నాం. పెరుగుతున్న ఆహార ధరలను నియంత్రించేందుకు దిగుమతులు అవసరమన్న వాదనను అడ్డం పెట్టుకొని, విధానకర్తలు చౌకైన, సబ్సిడీ ఇచ్చిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను అనుమతిస్తున్నారు. దేశంలో మంచి పంటలు పండి నప్పటికీ, దిగుమతులు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. దిగుమతులు ఎంత ఎక్కువగా వచ్చి పడితే, అది అంతగా సన్నకారు రైతుల జీవనోపాధిపై వేటు పడుతుంది. తమ ఉత్పత్తిని అమ్ముకోలేక, సన్నకారు రైతులు వ్యవసాయాన్ని వదిలి, చిన్నచిన్న ఉద్యోగాల కోసం పట్టణ ప్రాంతాలకు వలుసపెడుతున్నారు. దేశంలో ఉపాధి సృష్టి జరుగని పరిస్థితిలో, సన్నకారు రైతులను పట్టణాలకు వెళ్ళే పరిస్థితులు సృష్టించడమన్నది ఆర్థికంగా అర్థరహితమైన విషయం.

# ఆహారధాన్యాల దిగుమతులు

## దేశీయంగా రైతుకు సవాల్

**న్యూఢిల్లీ, మార్చి 27 :** దేశంలో ఆహర ధాన్యాల దిగుమతులపై దృష్టి సారించాలి. అంతేగాకుండా సమీక్షించుకోవాలి. మనదేశంలో అన్నిరకాల ధాన్యం పండుతున్న దిగుమతులు చేసుకోవడం, ఇక్కడి రైతులకు భరోసా లేకుండా చేయడం సరికాదు. అలాగే ప్రజలకు కూడా సరసమైన ధరలకు ఆహారా ధాన్యలు దక్కడం లేదని గుర్తించాలి. రైతులను ప్రోత్సహించడం ద్వారా అన్నిరకాల పంటలు పండించే అవకాశం ఉన్న భూములను ఉపయోగించుకోవాలి. రైతులను ప్రోత్సహిస్తే అన్నిరకాలు పంటలు పండిస్తారు.అందుకు మన భూములు అనుకూలంగా ఉన్నాయి.గతంలో రికార్డు స్థాయిలో 97 మిలియన్ టన్నుల గోధుమ ఉత్పత్తి అయిన నేపథ్యంలో, కేవలం 8 లక్షల టన్నుల గోధుమలను ఉక్రెయిన్, రష్యా నుంచి జీరో డ్యూటీతో దిగుమతి చేయడం ఆర్థికంగా అర్థరహితం. రైతులు గిట్టుబాటు ధర లేక ఉల్లిపాయలను వీధుల్లో పారేసిన ఘటనలు ఇంకా మనం మర్చిపోలేదు. ఇదిలా ఉండగా, గతంలో పండుగల సమయంలో ప్రభుత్వం 3 లక్షల టన్నుల చక్కెరను 25 శాతం డ్యూటీని తగ్గించి మరీ దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది.



పప్పు ధాన్యాలు దేశంలో విరగపండిన సమయంలో అది జరిగిందని నివేదిక వివరించింది. దీనితో ధరలు పడిపోయి, రైతులు అత్యంత చౌకగా తమ ఫలసాయాన్ని అమ్ముకోవలసి వచ్చింది.ఒక్క శనగ పప్పు మినహా మిగిలిన పప్పు ధాన్యాలు అన్నింటిపై రైతులకు లాభంలో మార్జిన్ 30 శాతం పడిపోయింది. ఇదే తరహా ధరలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దేశంలో ఈసారి పండిన పెసర, కందిపప్పుకు కొనుగోలుదారులు లభ్యం కావడం లేదు. హోల్ సేల్ ధరలు పెరగకపోవడంతో పరిస్థితి ఆశాజనకంగా లేదు. భారత దేశం ఇప్పటికే లక్షల టన్నుల పప్పు ధాన్యాలను మొజాంబిక్ నుంచి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందంపై సంతకాలు చేసింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా నుంచి పప్పు ధాన్యాలు, నూనె గింజలను దిగుమతి చేసుకునేందుకు సంప్రదింపులు జరుపుతోంది. అమెరికా వ్యవసాయ శాఖ భారత్ సోయాబీన్ దిగుమతులను పెంచుకోవాలని సూచించ డంతో, వంట నూనెల దిగుమతులపై పెంచిన సుంకాన్ని గణనీయంగా తగ్గించడమంటే, వ్యవసాయ ఔట్‌సోర్సింగ్ అనేది మినహాయింపుగా కాక విధానమైపోయింది. ఇది మన ఆహార స్వయం పోషకత్వానికే కాదు కోట్లాది సన్నకారు రైతుల జీవనోపాధికి ముప్పుగా పరణమించింది. ఇలాంటి విధానాలను సమీక్షించుకోవాల్సిన సమయంఉంది. అప్పుడేరైతులకు మేలు జరుగుతుంది. ఆహారాన్ని దిగుమతి చేసుకోవడం అంటే నిరుద్యోగాన్ని దిగుమతి చేసుకోవడమే అన్న వాదనలో వాస్తవం గ్రహిచాలి. చౌకైన దిగుమతులను అనుమతించడమంటే, వ్యవసాయం నుంచి రైతులను బలవంతంగా బయిటకు పంపడమే. పంటలు దిగుబడులు సమయంలో దిగుమతులు వెల్లవలా వచ్చిపడటాన్ని ఎలా సమర్ధించుకుంటారు. అందువల్ల ధాన్యం ఉత్పత్తి, దిగుమతులు, ఎగుమతులు తదితర అంవాలపై స్పష్టమైన వ్యయసాయ విధానం రూపొందించుకుటే తప్పమనం సంక్షోభం నుంచి బయటకురాలేం.

# పదో తరగతి పేపర్ లీకేజీపై విద్యార్థి పిటిషన్

## వచ్చే నెల 7న కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశం

**నల్గొండ, మార్చి 27 :** నకిరేకల్ టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థిని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తన డిబార్‌ను రద్దు చేసి పరీక్షలు రాసేందుకు అనుమతి ఇవ్వాలని లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. విద్యా శాఖ సెక్రటరీ, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సెక్రెటరీ, నల్గొండ డీఈవో, ఎంఈవో, నకిరేకల్ పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్‌లను ప్రతివాదులుగా విద్యార్థిని పేర్కొం ది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా నల్గొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన విద్యార్థిని టెన్త్ పేపర్ లీకేజీలో వ్యవహారంలో డిబార్ అయింది. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించింది. పదవ తరగతి పరీక్ష పేపర్ లీకేజీ ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. ఈ వ్యవహారానికి సంబంధించి నకిరేకల్ పోలీ స్టేసన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. పది పరీక్షలో మాస్ కాపీయింగ్ నిందితులతో మున్సిపల్ చైర్మన్‌కు సంబంధాలు ఉన్నాయంటూ కేటీఆర్ ట్వీట్ చేశా రు. దీంతో కేటీఆర్ ట్వీట్‌పై నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత, శ్రీనివాస్ అభ్యంతరం




వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు అయ్యాయి. కాంగ్రెస్ నాయకుడు ఉగ్గడి శ్రీనివాస్ కూడా సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు.



# మనిషికి పంది కాలేయం..

## చైనా వైద్యుల అరుదైన ఘనత

**చైనా :** వైద్య రంగంలో మరో అరుదైన ప్రయోగం. బ్రెయిన్ డెడ్ అయిన మనిషి శరీరంలో పంది కాలేయాన్ని అమర్చారు. ఈ మేరకు చైనా వైద్యులు ప్రకటించారు. భవిష్యత్తులో రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. మానవ శరీరంలోకి సరిపోయేలా జన్యు సవరణలు చేసిన ఓ పంది కాలేయాన్ని వైద్యులు సేకరించారు. బ్రెయిన్ డెడ్ అయిన మానవ శరీరంలోకి దాన్ని మార్పిడి చేశారు. గతంలోనూ అమెరికా వైద్యులు పంది మూత్రపిండాలు, గుండెను విజయవంతంగా అమర్చారు. అయితే.. ప్రపంచవ్యాప్తంగా కాలేయ దాతలకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. ఈ పరిణామాల దృష్ట్యా వైద్యులు మానవులకు ఈ సమస్య నుంచి ఉపశమనం కల్పించేందుకు పరిశోధనలు చేస్తున్నారు. "జన్యు సవరణలు చేసిన పందుల అవయవాలను.. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించే అవకాశం ఉంటుంది. మళ్లీ మానవ కాలేయ దాత దొరికేంతవరకు ఆ రోగికి ఎలాంటి ఇబ్బందిలేకుండా ఉపయోగపడుతుంది. 10 రోజుల పాటు ఆ వ్యక్తి వైద్యుల పర్యవేక్షణలో ఉంటారు. పంది కాలేయం పనితీరు.. మానవ శరీరం ప్రతిస్పందనను మా వైద్య బృందం పరిశీలిస్తుంది. ఇప్పటివరకు కాలేయం పనితీరు సక్రమంగా జరుగుతోంది" అని చైనాలోని జియాన్‌లో నాల్గవ మిలిటరీ మెడికల్ యూనివర్సిటీ వైద్యులు తాజా ప్రకటనలో పేర్కొన్నారు. కాలేయ సంబంధ వ్యాధులతో బాధపడేవారికి ఈ ప్రయోగం ఎంతో మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. గతంలో ఓ వ్యక్తికి అమెరికా వైద్యులు పంది గుండెను విజయవంతంగా అమర్చారు. సర్జరీ తర్వాత అతడు 40 రోజుల వరకు బాగానే ఉన్నారు. అనంతరం ఆ గుండె వైఫల్యం చెందడంతో మృతి చెందారు. ఈ విషయాన్ని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ స్కూల్ ఆఫ్ మెడిసన్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా చైనా వైద్యులు చేసిన ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయనే అంశం ఆసక్తికరంగా మారింది.

### నిశ్చితార్థం అయిన తర్వాత

# బట్టతల ఉందని పెళ్లికి నిరాకరణ

## మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

**హైదరాబాద్, మార్చి 27 :** నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లికి యువతి నిరాకరించడంతో యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఈ విషాదకర ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన ప్రకాష్‌మాల్ దంపతులకు ఇద్దరు కుమారులు.. వీరిలో చిన్న కుమారుడు పురోహిత్ కిషోర్ ఎంబీబీఎస్ డాక్టర్‌గా అల్వాల్ బస్తీ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు.. ఈ క్రమం లోనే.. కిషోర్‌కు కొన్నిరోజుల కిందట ఓ అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. అంతా బాగానే ఉందనుకున్న క్రమంలోనే.. కిషోర్ కు బట్టతల ఉండడం, ఇతర కారణాల వల్ల ఆ అమ్మాయి అతనితో పెళ్లికి నిరాకరిం చింది.. దీంతో నిశ్చితార్థం అర్ధాంతరంగా రద్దయింది. ఆ తర్వాత కిషోర్‌కు వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు సంబంధాలను చూస్తున్నా కుదరడం లేదు.. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కిషోర్ బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై ఇంట్లో నుంచి బటయకు వెళ్లాడు.. ఆ తర్వాత బొల్లారం వెళ్లి అక్కడ రైల్వేస్టేషన్ వద్ద వాహనాన్ని ఉంచాడు.. అనంతరం సమీపంలోని క్యావలరీ బ్యారక్ రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకున్న కిషోర్.. నిజామాబాద్



నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న హుజూర్‌సాహిబ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. గుర్తించిన రైలు లోకో పైలె ట్.. జీఆర్పీ పోలీసులకు సమాచారాన్ని అందించారు.. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. అతని వద్ద ఉన్న గుర్తింపు కార్డు చిరునామా ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు.. అనం తరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. కిషోర్ మృతితో కుటుంబంలో విషాదఛాయులు అలుముకున్నాయి..



# దంచికొడుతున్న ఎండలు

**హైదరాబాద్, మార్చి 27 :** తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఇటీవల ద్రోణి కారణంగా రెండుమూడురోజులు వర్షాలు కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాబోయే నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. నిన్న ఉమ్మడి నిజామాబాద్ అధికంగా 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక రాష్ట్రంలో పొడి వాతవరణం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో జనం ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఎండలతో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### స్కాలర్‌షిప్స్, ట్యూషన్ ఫీజుల దరఖాస్తు

# గడువు మరోసారి పొడిగింపు

**హైదరాబాద్, మార్చి 27 :** తెలంగాణలోని విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. స్కాలర్‌షిప్స్, ట్యూషన్ ఫీజుల దరఖాస్తు గడువు మరోసారి పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ఈబీసీ విద్యార్థుల బోధన ఫీజులు, ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మే 31 వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి దరఖాస్తు ప్రక్రియ గడువు మార్చి 31తో ముగియనుంది. అయితే మరో మూడునెలలపాటు పొడిగించింది. ఇప్పటికే డిసెంబరు 31తో ముగియాల్సిన గడువును తర్వాత జనవరి 31 వరకు, ఆ తదుపరి మార్చి 31కి వరకు మరోసారి పొడిగించింది. తాజాగా మరోసారి అవకాశం కల్పించింది. కొన్ని ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశాలు ఆలస్యం కాగా, ఆయా ప్రవేశాల సమాచారం ప్రభుత్వానికి రావడంలో ఆలస్యమైంది. దీంతో అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. కొత్తగా కోర్సుల్లో చేరిన విద్యార్థులు దాదాపు 5 లక్షల మందికిపైగా ఉంటారని అంచనా. ఇప్పటికి 10 లక్షల వరకు దరఖాస్తులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మే 31 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.



2024-25 విద్యాసంవత్సరానికి 11,88,120 మంది విద్యార్థులకు గాను 10,34,074 మంది దరఖాస్తు చేశారు. ఎంబీబీఎస్, పీజీ మెడికల్ ప్రవేశాలు ఇంకా పూర్తికానందున విద్యార్థుల వివరాలను కాళోజీ వర్సిటీ ఎస్సీ సంక్షేమశాఖకు ఇవ్వలేదు. వివరాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు దరఖాస్తు చేయడానికి వీల్లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి మే 31 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయినవారు ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా కళాశాలల యాజమాన్యాలు మే 31 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

# పాఠశాల ప్రవేశ వయస్సు ఆరేళ్లు

## కేరళ ప్రభుత్వం నిర్ణయం

**తిరువనంతపురం, మార్చి 27 :** కేరళలో పాఠశాల ప్రవేశ వయస్సు ఆరేళ్లుగా మార్చవచ్చని మంత్రి వి. శివన్‌కుట్టి అన్నారు. అధికారిక విద్య కోసం ప్రస్తుతం రాష్ట్రంలో పాఠశాల ప్రవేశ వయస్సు ఐదు సంవత్సరాలుగా ఉంది. దీనిని 2026-27 విద్యా సంవత్సరం నుండి ఆరు సంవత్సరాలకు పెంచవచ్చని మంత్రి తెలిపారు. ఆరు సంవత్సరాల వయస్సు తర్వాత పిల్లలు అధికారిక విద్యను అభ్యసించేందుకు సిద్ధంగా ఉంటారని శాస్త్రీయ అధ్యయనాలు సూచిస్తున్నాయని ఆయన తెలిపారు. అందుకే విద్యాపరంగా అభివృద్ధి చెందిన అన్ని దేశాలు అధికారిక విద్యలో ప్రవేశ వయస్సును ఆరు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. కానీ కేరళ సమాజం ఐదు సంవత్సరాల వయస్సులో పిల్లలను మొదటి తరగతిలో చేర్చుకుంటోందని, అయితే ఆరేళ్ల వయస్సులోనే పెద్ద సంఖ్యలో పిల్లలు పాఠశాలలో చేరుతున్నారని తెలిపారు. ప్రస్తుతం 50 శాతం కంటే ఎక్కువ మంది పిల్లలు ఆరు సంవత్సరాల వయస్సు తర్వాత పాఠశాలకు హాజరవుతున్నారని, దీనిని ప్రోత్సహించాలని మంత్రి శివన్‌కుట్టి అన్నారు.



## దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి గురువారం దేవస్థానం ఆవరణలో దేవాలయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఇనిస్పెక్టర్ వెంకటలక్ష్మి శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డిలు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం నూతన పాలకమండలి కృషి చేయాలని దేవాలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీరామనవమి, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించి దేవాలయ ప్రతిష్టను పెంచాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం చైర్మన్ గంజి అశోక్, డైరెక్టర్లుగా ఎడవెల్లి శివలక్ష్మి, రవ్వ నరేందర్, కల్వల లింగస్వామి, మల్లం హరిప్రసాద్, పోగులకొండ ఆదిత్య శర్మలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి, గ్రామ మాజీ సర్పంచ్ పసల అన్నా మేరీ శౌరి, బత్తెపు అంజయ్య, మల్లం శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి సత్తమ్మ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ కల్యారి చంద్రయ్య, వలిగొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉక్కుర్తి చంద్రయ్య, బూడిద పాపయ్య, బూడిద బిక్షమయ్య, ఎడవల్లి మల్లేశం, పరకాల ముత్యాలు, పిట్టల గణేష్, నానమాల ఉప్పలయ్య, గంజి రామకృష్ణ, చిట్టోజు వెంకట నారాయణ చారి, సీత శంకర్, బొమ్మ నరసింహ, కొడితల విజయ, బూడిద సుగుణమ్మ నరసింహ, ఎడవల్లి నరసింహ, కడవేరు యాదగిరి, వేముల మణికాంత్, చేగూరి హరిప్రసాద్, బొడిగ చంద్రమౌళి, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం కోసం
# దరఖాస్తు చేసుకోవాలి

**వలిగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్**



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో 6 వేల కోట్లతో తెలంగాణ రాష్ట్రంలోని ఐదు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి వలిగొండ మండల యువజన కాంగ్రెస్ తరపున యువజన కాంగ్రెస్ వలిగొండ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.గత పది సంవత్సరాలుగా తీవ్ర అన్యాయానికి గురైన నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఈ ప్రభుత్వం ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తూనే మరొకవైపు ఉపాధి అవకాశాలు పెంపొందించడం కోసం సబ్సిడీతో రుణాలు అందించడం హర్షించదగ్గ విషయమని ఆయన తెలిపారు. దీనికి సహకరించిన క్యాబినెట్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఇన్చార్జిలకు, బీసీ కమిషన్ చైర్మన్, ఎస్ సి కమిషన్ చైర్మన్ లకు యువజన కాంగ్రెస్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



## అక్రమ నిర్మాణాలకు
# అండగా 'టిపిఎస్ సుకన్య'

- అక్రమ నిర్మాణాలను అడ్డుకోవలసిన అధికారులే అండగా ఉండటం విడ్డూరం.
- 5వ డివిజన్ మల్లికార్జున నగర్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణమే ఇందుకు నిదర్శనం
- అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకుంటారా...? లేదా...? అనేది వేచి చూడాల్సిందే..

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ నగరంలో అక్రమ నిర్మాణాల పట్ల టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు కంచె చేనుమేస్తున్నట్లుగా అనిపిస్తుంది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్న చోట ఉక్కుపాదం మోపి కార్పొరేషన్ కు ఆదాయం వచ్చేలా అధికారుల పనితీరు ఉండాలే కానీ, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పీర్జాదిగూడ నగర పరిధిలోని 5వ డివిజన్ మల్లికార్జున నగర్ లో అక్రమ నిర్మాణానికి టీపీఎస్ సుకన్య అండగా నిలుస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. తక్షణమే ఈ అక్రమ నిర్మాణపై చర్యలు తీసుకొని టీపీఎస్ సుకన్య తన చిత్తశుద్ధిని చాటుకుంటుందా.. లేదా.. అనేది వేచి చూడాల్సిందే. అదే విధంగా పీర్జాదిగూడ నగరంలో ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతు న్నాయో తక్షణమే వాటిపై కఠిన చర్యలు తీసుకొని కార్పొరేషన్ కు ఆదాయం వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులందరూ ఎల్ఆర్ఎస్, ఆస్తిపన్నులంటూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఇదే అదనుగా అక్రమ నిర్మాణదారులు యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరుతున్నారు.

## వీధి వ్యాపారులకు చేయూతనందించాలి
# తై బజార్ వేలం విరమించుకోవాలి

**మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**

- గత పాలకవర్గంలో తై బజార్ రుసుమును వసూలు చేయొద్దని తీర్మానం
- చిన్న చిన్న వ్యాపారాల జీవనోపాధికి సహాయ సహకారాలు అందించాలి
- మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరరావుకు వినతి పత్రం అందించిన మాజీ మేయర్, మాజీ కార్పొరేటర్లు





**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో 2025-26 సంవత్సరానికి గాను తైబజారు రుసుము వసూలు చేసే పద్ధతిని విరమించుకోవాలని మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పిర్జాదిగూడ నగర కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వరరావుకు మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్న చిన్న వీధి వ్యాపారుల నుండి, తోపుడుబండ్ల నుండి తై బజార్ రుసుమును వసూలు చేయకుండా, హక్కును లీజుకు ఇచ్చుటకు నిర్వహించబడు బహిరంగ వేలం నిలుపుదల చేయాలని కమీషనర్ ను కోరారు. ఈనెల 24వ తేదీన తైబజార్ రుసుము ను వసూలు చేసేందుకు బహిరంగ వేలం నిర్వహించాలని నోటీసు విడుదల చేశారని అన్నారు. పిర్జాదిగూడ నగరంలో విభిన్నమైన వ్యాపారాలు చేసుకుంటూ చిన్న వ్యాపారులు వారి జీవనోపాధిని సాగిస్తూ వారు ఆర్థికంగా బలోపేతం కాగలరు అన్న మానవతాధృక్పథంతో తైబజారు రుసుము వసూలు చేయకూడదని గత మా పాలకవర్గం తీర్మానించిందన్నారు. ఈ నిర్ణయం పట్ల చిన్న వ్యాపారులు ప్రజానికం సానుకూలంగా స్పందించారని." ఒక మహిళకు సాధికారత కల్పిస్తే మెత్తం సమాజాన్నేఉద్ధరించినట్లు ఆవుతుంది "అన్న సదాశయంతో మా పాలక వర్గం తీసుకున్న నిర్ణయం మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చిందన్నారు. మహిళాసాధికారిత సాకారానికి నాంది పలికిందని అన్నారు. పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజల సంతోషమే పాలకునికి సంతోషం కలిగిస్తుంది వారి సంక్షేమమే పాలకునికి సంక్షేమం అని తెలిపారు. తైబజారు రుసుము సేకరించేందుకు బహిరంగ వేలం ప్రక్రియను పరిశీలించినపుడు, గతంలో వేలం దక్కించుకున్న వ్యక్తులు నిర్దేశిత రుసుము కంటే ఆధిక మెత్తంలో రుసుం వసూళ్ళకు పాల్పడేవారని, దౌర్జన్యాలు, అసాంఘిక శక్తుల అరాచకాలు, శాంతి భద్రతలకు విఘాతంగా పరిణమించేవి. ఇలాంటి దుశ్చర్యలను ఆరికట్టటానికే మా పాలకవర్గం తైబజారు రుసుము వసూలు చేయకూడదు అని తీర్మానించిందని అన్నారు. "పాలనాయంత్రాంగం, పాలకుల ప్రాథమిక లక్ష్యం ప్రజల కోసం పనిచేయడమే" అలాగే ప్రభుత్వం కూడా స్వీయ ఉపాధి చేసుకునే మహిళలు, యువకులను, ముఖ్యంగా చిన్న వ్యాపారుల ప్రోత్సహించేదుకు అనేక కార్యక్రమాలు రూపొందించి , అమలు పరిచి, చిన్న వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి అన్నది సుస్పష్టం. "నేడు రేపు మరునాడు ప్రజలను ఒప్పించి ముందుకు సాగాలి ప్రజాస్వామ్యంలో ఇది నిరంతర ప్రక్రియ: ఈ ప్రక్రియ విధివిధానాల రూపకల్పన అమలు ఆధికారులదే. ఆధికారులు ఎంత సమర్ధవంతంగా సహేతుకంగా ఆశావాద ధృక్పథంతో పనిచేస్తారో వారు అంత మన్ననలు పొందుతారు. అందువల్ల, పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలో 2025-26 సం.రాని గాను తైబజారు రుసుము వసూలు చేసే హక్కును లీజుకు ఇచ్చుటకు నిర్వహించబడు బహిరంగ వేలం నిర్వహించకుండా ఆప్రకియను నిలిపివేసి ఇతర మార్గాలను అన్వేషించవలసిన అవసరం ఉంది. ఈ దిశగా ఆలోచించి అన్ని విషయాలు పరిగణంలోకి తీసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. "ఆభివృద్ధి, సంక్షేమం పాలనా రధానికి రెండు చక్రాలు. అధికార పగ్గాలతో ఈ రధాన్ని చాకచక్యంగా సారధ్యం చేసేవాడు నిజమైన పరిపాలనా సారధి". తైబజారు రుసుము వసూలు చేసే హక్కును లీజుకు ఇచ్చుటకు నిర్వహించబడు బహిరంగ వేలం ప్రకియ నిలిపివేత చర్య ఎంతోమంది చిన్న వ్యాపారులకు , మహిళలకు ఆర్థిక చేయూతనిస్తుందనేది నిర్వివాదాంశం . వారి ఆర్థిక స్దితి పెరగటం వల్ల ఇతర మార్గాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని కోరారు. ఏది ఏమైనా తై బజార్ బహిరంగ వేలాన్ని విరమించుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కొల్తూరి మహేష్, నాయకులు ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం నాయకుల
# అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

- రామోజీ ఫిల్మ్ సిటీ భూ దురాక్రమాలను ఖండిస్తున్నాం
- సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్ :** గురువారం రోజు సిపిఎం పార్టీ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీత్ నగర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ... గత కాంగ్రెస్ ప్రభుత్వం 2007 సంవత్సరంలో ఇబ్రహీంపట్నం మండలం నాగన్ పల్లి రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 189, 203 లలో 577 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచిందని, అట్టి భూమిని రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ఆక్రమించిందని, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేకసార్లు కలెక్టర్, ఆర్డిఓ, ఎమ్మార్వో స్థాయిలో రామోజీ యాజమాన్యంతో చర్చలు జరిపి భూములకు సంబంధించి రామోజీ యాజమాన్యం ఈ భూములు పేదలకు చెందినయని రాతపూర్వకంగా రాసి ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులను భూమి దగ్గరికి రానీయకుండా ప్రహరీ గోడ ఏర్పాటు చేసి భయభ్రాంతులకు గురి చేశారు పేదలకు ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యను, జిల్లా ముఖ్య ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఎం చేవెళ్ల డివిజన్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. వెంటనే ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి ఇళ్ల పట్టాలు పొందిన పేదలందరికీ ఇళ్ల జాగాలు చూపియాలని, ప్రభుత్వ భూమి కబ్జా చేసిన రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యంపై అసైన్మెంట్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షులు దప్పు మహేందర్, రాజేందర్, రవి,సాయి, వెంకటేష్, కృష్ణ, శ్రీను, యాదగిరి, ఇస్మాయిల్, బాలు, డాన్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళ బ్రెయిన్‌డెడ్‌తో అవయవదానం

**మంత్రి లోకేశ్ తక్షణ స్పందన**

**అమరావతి:** గుంటూరులో బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవదానానికి ఓ కుటుంబం ముందుకు వచ్చింది. తక్షణమే స్పందించిన మంత్రి నారా లోకేశ్ సొంత ఖర్చులతో అవసరమైన ఏర్పాట్లు చేశారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరులోని రమేష్ హాస్పిటల్స్‌లో తీవ్ర అనారోగ్యంతో చేరిన చెరుకూరి సుష్మ అనే మహిళ బ్రెయిన్‌డెడ్ అయింది. ఆమె కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. వెంటనే ఆస్పత్రి వైద్యులు అవయవాలు తరలించి మరికొందరికి ప్రాణదానం చేసే అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. తక్షణమే స్పందించిన లోకేశ్.. బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ గుండెను తరలించేందుకు సొంత ఖర్చుతో ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. తిరుపతిలోని ఆస్పత్రికి గుండె చేరే వరకు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేసేలా సంబంధిత యంత్రాంగంతో మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్‌కు మహిళ కుటుంబసభ్యులు, రమేశ్ హాస్పిటల్స్ వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పోచంపల్లి నుండి భువనగిరి జిల్లా కేంద్రానికి
# వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలి

- మండల, పట్టణంలో పేరుకపోయినా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్



**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్ :** పోచంపల్లి పట్టణం నుండి భువనగిరి జిల్లా కేంద్రానికి వెళ్లడానికి పూర్వపు రోడ్డు అయినా రేవణపల్లి నుండి పెద్దరావులపల్లి వరకు ఏర్పడ్డ రోడ్డు గుంతలను పూడ్చి, ఆ రోడ్డును డబల్ రోడ్డుగా మార్చి వేయాలి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. గురువారం సిపిఎం భూధాన్ పోచంపల్లి మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో రోడ్డును డబల్ రోడ్డుగా మార్చాలని, మండల పట్టణంలో పేరుకపోయినా ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్దరావులపల్లి నుండి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని పెద్దరావులపల్లిలో పాదయాత్రలో ప్రారంభించి, తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ భువనగిరి జిల్లా కేంద్రానికి పూర్వపు రోడ్డు అయినా పెద్దరావులపల్లి రోడ్డు డబల్ రోడ్డుగా మారిస్తే జిల్లా కేంద్రానికి అవసరాలరీత్యా వెళ్లేవారికి 8 కిలోమీటర్లు తగ్గుతుందని, టోల్ ప్లాజా సమస్య కూడా తీరుతుంది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఆ రోడ్డుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉన్న సింగిల్ రోడ్డు గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాల గురవుతున్నారని ఆ గుంతలను పూడ్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా 30 శాతం నుండి 40 శాతం వరకు రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా కింద డబ్బులు రాలేదని వారందరికీ వెంటనే ఇవ్వాలని కోరారు. ఇంకా ఇండ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు కూడా అర్హత కలిగిన వారందరికీ ఇవ్వాలని నర్సింహ డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోట రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి మండలం, పట్టణంలో మూసీ నీళ్ల ఆధారంగానే పంటలు పండిస్తున్నామని దీనితో అనేక రకాలైన ఇబ్బందులకు, జబ్బులకు రైతులు, ప్రజలు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయంగా గోదావరి నది జలాలను అందించాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా లింక్ రోడ్ల సమస్య, అక్కడక్కడ మూసీ కాలువలపైన బ్రిడ్జిల నిర్మాణం ఇలాంటి సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. మండల పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల హాస్పిటల్ గా మార్చి 24 గంటల వైద్యాన్ని అందించాలని, ఇంకా ఆయా గ్రామాల్లో నిర్మాణంలో లేని అంగన్వాడి, గ్రామపంచాయతీ కార్యాలయాలను నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలో మండలంలో పూర్తయిన డబల్ బెడ్ రూం ఇండ్లను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని తెలియజేశారు. అనంతరం సమస్యలతో కూడిన మెమొరండాన్ని ఇంచార్జ్ తహశీల్దార్ కు ఇచ్చినారు.ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, మాజీ మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి, పార్టీ పట్టణ, మండల కమిటీ సభ్యులు వద్దేపల్లి యాదగిరి, బుగ్గ లక్ష్మయ్య, పోన్నమోని కృష్ణ , పార్టీ మండల కమిటీ సభ్యులు నోముల కృష్ణారెడ్డి, నెలకంటి జంగయ్య, కల్యారి బిక్షపతి, పత్తి బిక్షపతి, బోయినపల్లి పుష్పలత, బేతి కమలమ్మ, కోట అశోక్, సామ జంగారెడ్డి, నాయకులు కంజర్ల అశోక్, వారాల మల్లారెడ్డి, కోట రమేష్, ముద్దం సత్తయ్య, గుర్రం రామచంద్రారెడ్డి, వీరారెడ్డి, రాజు, అనసూయ, మరి సోమయ్య, భూపాల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జంగారెడ్డి, పాండురంగారెడ్డి, గూని బిక్షపతి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

www.rajamudranews.com
రాజముద్ర
తెలుగు దిన పత్రిక



## రైతులు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ప్రభుత్వం అందజేస్తున్న నష్టపరిహారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం వికారాబాద్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలం, హకీంపేట కు సంబంధించిన పట్టా భూమి కలిగిన రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమ్మతి తెలిపిన రైతులకు తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌లతో కలిసి నష్ట పరిహార చెక్కులను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... పారిశ్రామిక పార్కులో భూములను కేటాయించిన రైతులకు ఒకే విడతలో నష్టపరిహార చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం ద్వారా తమ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. దుద్యాల మండలం, హకీంపేటలో పట్టా భూమి కలిగిన 32 మంది రైతులు 29 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్క్ కు తమ భూములను కేటాయించేందుకు సమ్మతి తెలుపనైనది, పారిశ్రామిక పార్కుకు భూములను కేటాయించిన రైతులకు నష్టపరిహారం కింద 5,80,00,000 కోట్ల రూపాయల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దుద్యాల మండలం తహసీల్దార్ కిషన్, జి సెక్షన్ సూపరింటెండెంట్ నాఫీస్ ఫాతిమా, టీ ఎస్ ఐఐసి అసిస్టెంట్ మేనేజర్ అనురాధ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు ఘన సన్మానం

### ఎమ్మెల్సీ మల్క కొమురయ్యను ఘనంగా సన్మానించిన ట్రస్మా ప్రతినిధులు

**ఉప్పల్, రాజముద్ర న్యూస్:** బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలకు అండగా ఉంటూ, యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవిధంగా చూడాలని ట్రస్మా అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ట్రస్మ సంఘం సభ్యులు ఎమ్మెల్సీ మల్కా కొమురయ్యను ఘనంగా సన్మానించారు. ఇటీవల కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ గా భారీ మెజార్టీ తో గెలుపొందిన మల్కా కొమురయ్యను తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధులు పుష్పగుచ్ఛం ఇచ్చి , శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య సానుకూలంగా స్పందించి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అనిల్ కుమార్ , రాష్ట్ర ట్రస్మా కోశాధికారి కే. శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి లయన్ చింతల రామచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరం రాంరెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, మీడియా కన్వీనర్ వేములకొండ సోమశేఖర్ గౌడ్, మేడ్చల్ జిల్లా సెక్రెటరీ చిలుక శివకుమార్, ట్రస్మా ప్రతినిధులు మురళి, శివరామకృష్ణ , ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడటం హర్షించదగిన విషయం

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆంగ్ల బోధన గావించి పిల్లలు ఆంగ్లం లో ధారాళంగా మాట్లాడటం హర్షించదగిన విషయమని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారము వికారాబాద్ కలెక్టరేట్ సమావేశము హాలు నందు జరిగిన యంగ్ ఓరేటర్స్ క్లబ్, బొస్చ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యా కదంబం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ... జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ఏర్పాటుచేసిన వై ఓ సి యంగ్ ఓటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా లో ఉన్నటువంటి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ బోధించడం జరిగిందని ఇంగ్లీష్ కు సంబంధించి విద్యార్థులు దారాళంగా ఇంగ్లీషు మాట్లాడడానికి ఉపాధ్యాయులు వివిధ రకాల కృత్యాలు, యాక్టివిటీస్ ద్వారా ఇంగ్లీష్ నేర్పించడం జరిగిందని, ఇంగ్లీష్ మాట్లాడడానికి ఉపాధ్యాయులు బోధన జరిపించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వై ఓ సి చేస్తున్నటువంటి సేవలు కొనియాడారు. అదేవిధంగా వైఓసి క్లబ్ ద్వారా పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. రాబోవు రోజుల్లో ఇంగ్లీష్ పట్ల మరింత శ్రద్ధను చూపిస్తూ పిల్లలకు ఇంగ్లీషు భాష పట్ల ఆసక్తిని కలిగించేలా భోధించాలని సూచించారు. విద్యార్థులు మాతృభాషతో పాటు ఇంగ్లీష్ భాషను కూడా కచ్చితంగా నేర్చుకుని ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నాటికను తిలకించి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాదికారి రేణుక దేవి, వై ఓ సి సభ్యులు, డిఆర్పీలు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక మహిళా సంఘాలు బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలి

### సెర్ప్ సీఈఓ వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ధాన్యం కొనుగోలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్, పెట్రోల్ బంకుల నిర్వహణ తదితర కార్యక్రమాల వల్ల స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ నుండి సెర్ఫ్ సీఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఆర్డిఓ,సెర్ఫ్ అధికారులతో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐ కె పి ద్వారా రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరింత పెంచాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐకెపి మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన పెండింగ్ లో ఉన్న కమిషన్ ను సమీక్షించాలని, కమిషన్ మొత్తాన్ని 10 శాతం జిల్లా సమాఖ్యలు, 90 శాతం గ్రామ సమస్యలకు వెళ్లే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, గన్ని బ్యాగుల సమీకరణ చేయాలని , భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో మహిళ సంఘాల ద్వారా గోడౌన్లతో పాటు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి ఆలోచిస్తున్నందున ధాన్యం కొనుగోలులో స్వయం సహాయక మహిళా సంఘాలు చురుకుగా పాల్గొనేలా చూడాలన్నారు. యుడిఐడి నంబర్లు, సదరం క్యాంపుల నిర్వహణకు సంబంధించి స్లాట్ పెండింగ్లో ఉన్న జిల్లాలు తక్షణమే స్లాట్ ఇవ్వాలని, సదరం క్యాంపుల నిర్వహణకు ఆసుపత్రులలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాలని, సదరం క్యాంపులు డేటా ను ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు మంచి డేటా ఎంట్రీ ఆపరేటర్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సదరం క్యాంపుల లో మౌలిక సదుపాయాలతో పాటు, పౌర సదుపాయాలను పెంచాలన్నారు. వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి చనిపోయిన వారి పేర్లను జాబితాలో తీసివేయడం భాగస్వామికి అర్హత ఉన్నట్లయితే పెన్షన్ మంజూరి చేయడం, ఒక కుటుంబంలో ఒకరికే వృద్ధాప్య పింఛన్ ఉండేలా చూడడం, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగించడం వంటివి ఎంపీడీఓల ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. చనిపోయిన కేసుల విషయంలో పూర్తిగా పరిశీలన చేసిన తర్వాతే నిర్ధారణకు రావాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ తో పాటు,వారి ఆదాయ మార్గాలు పెంచుకునే విధంగా ప్రైవేట్ ఆర్డర్లపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేకించి యూనిఫామ్స్ కుట్టడానికి రాష్ట్ర స్థాయిలో ఆరుగురు మాస్టర్ ట్రైనర్లను గుర్తించడం జరిగిందని వీరు మండల స్థాయి లో ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ప్రతి జిల్లా, నియోజక వర్గ, మండల కేంద్రాలలో పెట్రోల్ బంక్ లను నిర్వహించాలని ఆలోచిస్తున్నందున జిల్లా స్థాయిలో పెట్రోల్ బంక్ ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించినట్టే, మండల, నియోజకవర్గాల స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ పెట్రోల్ బంకుల వద్ద రెస్టారెంట్ ,మాల్స్ నిర్వహించాలని, భవిష్యత్తులో ఇందిరా మహిళా శక్తి బజార్ వంటి వాటిని నిర్వహించేందుకు ఆస్కారం ఉందన్నారు . సాధారణ జీవిత బీమా, ప్రమాద బీమా ల పై ఆయన సమీక్షించారు. సెర్ఫ్ సీఈఓ దివ్య వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న 128 సెంటర్లలో ఐకేపీ కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత యాసంగి సీజన్ 34 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గన్ని బ్యాగులు సరిపడ అందుబాటులో ఉన్నాయని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ కూడా పూర్తి కావాల్సి ఉందని అన్నారు. దివ్యాంగులను నిర్ధారించేందుకు అవసరమైన పరికరాలు ఆసుపత్రిలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి. కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, సరోజ, మోహన్ బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలించిన డిపిఓ



**గార్లదిన్నె, రాజముద్ర న్యూస్:** మండల పరిధిలోని బుదేడు గ్రామంలో ఉన్న సంపద సృష్టి కేంద్రాన్ని డిపిఓ నాగరాజు నాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద సృష్టి కేంద్రంలోని తొట్టెలలో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించే సిబ్బంది తడి, పొడి చెత్తగా వేరు చేసే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సంపద సృష్టి కేంద్రాల తొట్టెల్లో తడి చెత్త కుళ్ళబెట్టి వానపాములు వదిలి వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవడం ద్వారా పంచాయతీ ఆదాయం సృష్టించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం సక్రమంగా జరగాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే ఇంటి నుండి పని చేసే సర్వే, ఆధార్ లేని పిల్లల సర్వే, నాన్ రెసిడెంట్ సర్వే మొదలైన వాటి యొక్క ధృవీకరించబడిన సర్వే స్థితి కూడా మంచి స్థితిలో ఉందన్నారు . సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి దామోదరమ్మ, సర్పంచ్ శివాంజనేయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

- కమిషనర్ త్రిలేశ్వరరావు
- 90 శాతం వడ్డీ మాఫీ ఈ నెల చివరి వరకు మాత్రమే.



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆస్తిపన్నుపై 90 శాతం వడ్డీ రాయితీని పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ త్రిలేశ్వరరావు ఒక ప్రకటనలో సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు బకాయిలున్న ఆస్తిపన్నుపై వన్ టైం సెటిల్మెంట్ కింద 90శాతం వడ్డీని మాఫీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని కార్పొరేషన్ పరిధిలో పన్ను బకాయిలున్న ఇళ్ల యజమానులంతా ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్నుల వసూళ్లు విస్తృతంగా సాగుతోందని, వందశాతం లక్ష్యాన్ని సాధించడానికి తమ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. కార్పొరేషన్ అభివృద్ధికి దోహదపడే ఆస్తిపన్నులను ప్రజలు సకాలంలో చెల్లించాలని కమీషనర్ కోరారు. ప్రజలు తాము చెల్లించాల్సిన ఆస్తిపన్నులను ఆన్లైన్ ద్వారా గాని, మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్లలోగాని, ఆయా కాలనీల బిల్ కలెక్టర్లకు గాని చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన బకాయిలపై వడ్డీ మాఫీ కార్యక్రమాన్ని డివిజన్ల వారీగా క్యాంపులను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని కమీషనర్ త్రిలేశ్వరరావు వెల్లడించారు.

## అమెరికా ఒత్తిడేం లేదు.. వాటిపై సుంకాలు తగ్గిస్తాం..

- పనులను ప్రారంభించిన మాజీ మేయర్ అమర్ సింగ్, స్థానిక మాజీ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్
- హాజరైన పలువురు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలనీవాసులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ నగరాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ అమర్ సింగ్, 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగర పరిధిలోని 15వ డివిజన్ విహారిక కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ... పీర్జాదిగూడ నగరం రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గత పాలకవర్గంలో తీర్మానించిన పనులను త్వరితగతిన పూర్తయ్యే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. అన్ని డివిజన్లలో సిసి రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు, త్రాగునీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ 15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్, మాజీ 2వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి, తవిటి ప్రశాంత్, విహారిక కాలనీ అధ్యక్షులు సంగపాక సుధాకర్, కాలనీ కోశాధికారి శ్రీనివాస్ నాయక్, కాలనీ పెద్దలు ఏవి రమణారెడ్డి, రమేష్ గౌడ్, దంతూరి వెంకటేష్ గౌడ్, యూత్ నాయకులు సుమిత్ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ముస్లింలకు రంజాన్ తోఫా అందజేసిన జడల యశిల్ గౌడ్

**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు పాటిస్తున్న నిరుపేద ముస్లిం కుటుంబాలకు సామాజిక వేత్త, బి ఆర్ ఎస్ జిల్లా యువ నాయకులు జె వై జి ఫౌండేషన్ అధినేత జడల యశిల్ గౌడ్ సహకారంతో భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెం, బస్వాపూర్ గ్రామాల్లో మాజీ గ్రంధాలయ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకుల కిట్లను అందజేసేందుకు సహకరించిన జడల యశిల్ గౌడ్ కి ధన్యవాదాలు తెలిపిన మైనారిటీ లు వారు ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమం చేయాలని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు,మాజీ వార్డు సభ్యులు,గ్రామస్తులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించిన ఎంపిడివో వెంకయ్య గౌడ్

### విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచన

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** పదవ తరగతి విద్యార్థులు నిర్భయంగా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని శంకర్పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ సూచించారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను శంకర్ పల్లి ఎంపిడివో వెంకయ్య గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ... పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థుల భోజనశాల, వంటగదిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మధుర వాణి, విద్యార్థినిలు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన కందుల ముత్తిలింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది నిరుపేద కుటుంబమైన వారికి ఏ జే ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ల రేపాక గ్రామ యువకులు ఏ జే ఆర్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి డీసీపీని సన్మానించిన ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘం నాయకులు

**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా నూతన డిసిపి అక్షాంశ్ యాదవ్ ని డిసిపి ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన బట్టు రామచంద్రయ్య, కొడాలి వెంకటేష్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ వారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ,బీసీ అగ్రవర్ణ పేదలపై పై జరుగుతున్న దాడులను అరికట్టాలని, త్వరలో ఎలక్షన్స్ ఉన్నందున రాజకీయ తోత్తులకు లోన్‌అవుతున్న గ్రామాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డాల్ఫిన్ హెూటల్ స్వర్ణ గిరి రోడ్డు క్రాస్ వద్ద ట్రాఫిక్ బందోబస్తు ఏర్పాటు చేయాలని మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అందరికీ సమాన న్యాయం జరిగేలా చూడాలని కోరారు ఈ సమావేశంలో బి.ఎస్.పిరాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య సామాజికవేత్త కొడారి వెంకటేష్,ఎడ్ల మహాలింగం,శరత్ యాదవ్, ధనంజన్న, వట్టెం మధు, సాయిరాం, శంకర్,వంశీ, హరికృష్ణ గౌడ్,మహేష్, తదితరులు పాల్గొన్నారు.





# దంచికొట్టిన పూరన్, మార్ష్

## లఖ్‌నవూ చేతిలో హైదరాబాద్ ఓటమి



**హైదరాబాద్:** ఐపీఎల్ 18లో లఖ్‌నవూ బోణీ కొట్టింది. హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 191 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ 16.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పూరన్ (70: 26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డాడు. మరో బ్యాటర్ మిచెల్ మార్ష్ (52: 31 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగాడు. వీరి దూకుడుతో లఖ్‌నవూ వడివడిగా విజయంవైపు వెళ్లింది. చివర్లో అబ్దుల్ సమద్ (22) దూకుడుగా ఆడాడు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో కమిన్స్ 2, షమీ, జంపా, హర్షల్‌పటేల్ ఒక్కో వికెట్ తీశారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. తొలుత ట్రావిస్ హెడ్ (47, 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా.. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన అనికేత్ వర్మ (36, 13 బంతుల్లో) క్రీజులో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. నితీశ్ రెడ్డి (32, 28 బంతుల్లో), హెన్రిచ్ క్లాసెన్ (26, 17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేశారు. పాట్ కమిన్స్ (18, 4 బంతుల్లో) హ్యాట్రిక్ సిక్స్‌లు బాది ఔటయ్యాడు. అభిషేక్ శర్మ (6), ఇషాన్ కిషన్ (0) తీవ్ర నిరాశపర్చారు. లఖ్‌నవూ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4/34) అదరగొట్టాడు. అవేశ్ ఖాన్, దిగ్వేశ్ రాఠీ, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

### ఆరంభంలోనే వరుస షాక్‌లు

ఇన్నింగ్స్ ఆరంభంలోనే సన్‌రైజర్స్‌కు వరుస షాక్‌లు తగిలాయి. తొలి రెండు ఓవర్లలో 15 పరుగులు వచ్చాయి. ఇన్నింగ్స్ మూడో ఓవర్ వేసిన శార్దూల్ ఠాకూర్ వరుస బంతుల్లో రెండు వికెట్లు పడగొట్టి సన్‌రైజర్స్‌ను గట్టిదెబ్బ కొట్టాడు. అభిషేక్ శర్మ పూరన్‌కు క్యాచ్ ఇవ్వగా.. గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్ కిషన్ ఎదుర్కొన్న తొలి బంతికే పంత్‌కు క్యాచ్ ఇచ్చి గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మరోవైపు, ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడాడు. అవేశ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్ బాదాడు. రవి బిష్ణోయ్ వేసిన ఆరో ఓవర్‌లో పూరన్, బిష్ణోయ్ క్యాచ్‌లు వదిలేయడంతో హెడ్‌కు రెండు జీవదానాలు లభించాయి. అయితే, వచ్చిన లైఫ్‌లను అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ప్రిన్స్ యాదవ్ బౌలింగ్ భారీ షాట్ ఆడే క్రమంలో హెడ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో అంపైర్ కాల్‌తో ఎల్బీడబ్ల్యూ నుంచి నితీశ్ తప్పించుకోగా కాసేపటికే బౌలర్స్ ఎండ్‌లో క్లాసెన్ రనౌట్ అయ్యాడు.

### అనికేత్ మెరుపులు

క్లాసెన్ ఔటైన తర్వాత వచ్చిన అనికేత్ ఆరంభం నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. నితీశ్ ఔటైనా మరో ఎండ్‌లో అనికేత్ చెలరేగాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదిన అతను.. దిగ్వేశ్ బౌలింగ్‌లోనూ వరుసగా మరో రెండు సిక్స్‌లు బాది తర్వాతి బంతికే డేవిడ్ మిల్లర్‌కు చిక్కాడు. ఎదుర్కొన్న మూడు బంతులను స్టాండ్స్‌లోకి పంపి జోరుమీదున్న కమిన్స్‌ను అవేశ్ ఖాన్ వెనక్కి పంపాడు. చివరి రెండు ఓవర్లలో సన్‌రైజర్స్ 10 పరుగులే చేయడంతో స్కోరు 190కే పరిమితమైంది.

# రోహిత్ టెస్టు భవిష్యత్తు..

## బిగ్ హింట్ ఇచ్చిన అగార్కర్ టీమ్



వరుసగా మూడోసారి టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు వెళ్లే ఛాన్స్‌ను టీమ్ఇండియా కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆసీస్‌తో జరిగిన బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని భారత్ చేజార్చుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో రోహిత్‌ను సారథిగా తప్పించాలనే డిమాండ్లూ వచ్చాయి. ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌తో క్రికెటర్లు బిజీగా ఉన్నారు. ఇది మే చివరికి ముగియనుంది. ఆ తర్వాత జూన్‌లో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ బరిలోకి భారత్ దిగనుంది. అప్పట్నుంచే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో ఎడిషన్ ప్రారంభమవుతుంది. గత రెండుసార్లు ఫైనల్‌కు చేరినా విజేతగా నిలవడంలో మాత్రం విఫలమైన టీమ్ఇండియా.. డబ్ల్యూటీసీ నాలుగో సీజన్‌ను ఘనంగా మొదలుపెట్టాలని భావిస్తోంది. అయితే, ఆసీస్‌తో టెస్టు సిరీస్ సమయంలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు రోహిత్ వీడ్కోలు చెబుతాడనే వార్తలు వచ్చాయి. అలాంటిదేమీ లేదని స్వయంగా హిట్‌మ్యాన్ తేల్చేశాడు. అతడిని కొనసాగిస్తారా? లేకపోతే పక్కన పెడతారా? అనేది ఇప్పుడు సెలక్టర్ల చేతిలో ఉంది. ఈక్రమంలో రోహిత్ కెప్టెన్సీతోపాటు టెస్టు భవిష్యత్తుపై అజిత్ అగార్కర్ టీమ్ ఓ కీలక హింట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో సిరీస్‌కూ రోహిత్‌నే సారథ్యం వహిస్తాడని సమాచారం. న్యూజిలాండ్, ఆసీస్‌తో సిరీస్‌లను కోల్పోయినా సరే రోహిత్‌పై నమ్మకం ఉంచనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 37 ఏళ్ల రోహిత్‌ను డబ్ల్యూటీసీ 2025-27 వరకూ కొనసాగిస్తారా? లేదా? అనే విషయంపై మాత్రం స్పష్టత లేదు. డబ్ల్యూటీసీ నాలుగో సీజన్ ఫైనల్ 2027లో జరగనుంది. వన్డే ప్రపంచకప్ కూడా అదే ఏడాది ఉంది. ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్ 50 ఓవర్ల వరల్డ్‌కప్‌ను నెగ్గాలనే ఉద్దేశంలో ఉన్నట్లు తెలుస్తోంది. లేకపోతే ఛాంపియన్స్ ట్రోఫీ (వన్డే ఫార్మాట్)ని గెలిచాకనే గుడ్‌బై చెప్పేసి ఉండేవాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం కొత్త సారథ్యంలోనే డబ్ల్యూటీసీతోపాటు వన్డే ప్రపంచ కప్ బరిలోకి దిగాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

### బుమ్రా విషయంలోనూ..

గత ఆస్ట్రేలియా పర్యటనలో వెన్నునొప్పి తిరగబెట్టడంతో జస్‌ప్రీత్ బుమ్రా ఆటకు దూరమయ్యాడు. ఇప్పటికే ప్రారంభమైన ఐపీఎల్ 18వ సీజన్ తొలి దశ కొన్ని మ్యాచుల్లో ఆడటమూ కష్టమే. అతడి ఫిట్‌నెస్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఎలాంటి అప్రూవ్ రాలేదు. ఐపీఎల్‌లో ఆడి ఫిట్‌నెస్‌ను నిరూపించుకొంటేనే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్ చివరివారంలో జట్టును సెలక్ట్ చేయనున్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. లయన్స్‌తో ఆడేందుకు ఇండియా స్క్వాడ్‌ను కూడా ఎంపిక చేయనుంది. ఆ జట్టుతోనే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెళ్తాడని సమాచారం.

## 2036 ఒలింపిక్స్ కోసం ఆశారాం బాపు ఆశ్రమం భూమి


2036లో ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు భారత్ పట్టుదలగా ఉంది. అందుకు వీలుగా స్థలాన్ని కేటాయించేందుకు కేంద్ర క్రీడా శాఖ యోచిస్తోంది. అయితే.. అందుకు రేప్ కేసులో దోషిగా తేలిన ఆశారాం బాపు ఆశ్రమానికి చెందిన భూమిని తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు జాతీయ మీడియా సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ కథనాలు ప్రచురించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం సమీపంలోని సర్దార్ పటేల్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్, ఒలింపిక్ విలేజ్‌తో పాటు ఇతర మైదానాలు, క్రీడాకారుల సౌకర్యాల కోసం స్థలం కేటాయించేందుకు క్రీడా శాఖ ప్రణాళికలు చేస్తోంది. అందుకోసం ఆశారాం బాపు ఆశ్రమం, భారతీయ సేవాసమాజం, సదాశివ ప్రజ్ఞామండల్ ఆశ్రమాలను వేరే చోటుకు తరలించే అవకాశం ఉంది. అహ్మదాబాద్ మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ సూచనలతో యంత్రాంగం ఏర్పాట్లు చేయనుంది. అహ్మదాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సాయంతో అంతర్జాతీయ కన్సల్టెంట్ ఒలింపిక్ క్రీడల ఏర్పాట్లకు సంబంధించి మాస్టర్ ప్లాన్ చేయనుంది. మైదానాలు, ఇతర సౌకర్యాల కోసం దాదాపు 650 ఎకరాల భూమిని సేకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. స్టేడియం సమీపంలోని శివనగర్, వంజారావాస్ వంటి నివాస ప్రాంతాలను కూడా క్రీడల కోసం సేకరించనుంది. కలెక్టర్ కార్యాలయం భూసేకరణ బాధ్యతలు స్వీకరించేందుకు సీఎం భూపేంద్ర పటేల్, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ ఆమోదం తెలిపినట్లు కథనాలు వెల్లడించాయి.



## లాభాల్లో ముగిసిన సూచీలు


**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకున్నాయి. ఆటో దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ పేర్కొనడంతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. ఆటో, ఫార్మా, టెలికమ్యూనికేషన్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు రాణించాయి. నిఫ్టీ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల్లోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్ నేపథ్యంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ మాతృ సంస్థ అయిన టాటా మోటార్స్ షేర్లు 6 శాతం మేర కుంగాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు అమెరికా కీలకమైన మార్కెట్ కావడం ఇందుకు కారణం. సెన్సెక్స్ ఉదయం 77,087.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,288.50) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,082.51 - 77,747.46 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 317.93 పాయింట్ల లాభంతో 77,606.43 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 105.10 పాయింట్లు లాభపడి 23,5 91.95 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.79 గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. టాటా మోటార్స్, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.61 డాలర్లు వద్ద కొనసాగుతుండగా.. బంగారం ధరకు మళ్లీ పెరిగి ఔన్సు 3087 డాలర్లు వద్ద ట్రేడవుతోంది.

# ఇన్ఫోసిస్- మైసూరు క్యాంపస్‌లో ట్రైనీల తొలగింపు




ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మైసూరు క్యాంపస్‌లోని ట్రైనీలను తొలగించినట్లు తెలుస్తోంది. తుది ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 40-45 మంది ట్రైనీలను తొలగిస్తూ ఈమెయిల్స్ జారీ చేసినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. "ఫైనల్ అసెస్‌మెం ట్‌లో సరిగ్గా రాణించనందున ఫౌండేషన్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద అర్హతను సాధించలేకపోయారు. దీంతో అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రామ్‌లో మీ ప్రయాణా న్ని కొనసాగించలేరు" అంటూ ట్రైనీలకు మెయిల్స్ పంపింది. అయితే ఇలా లేఆఫ్‌కు గురైన విద్యార్థుల కు ఇన్ఫోసిస్ మరో అవకాశం ఇచ్చింది. వీరందరికీ కౌన్సిలింగ్ సపోర్ట్‌తో పాటు ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాన్ని అందించాలని చూస్తోంది. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ నియామకాల కోసం 12 వారాల పాటు శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణ పూర్తిచేసిన వారందరికీ ఇన్ఫోసిస్ బీపీఎం లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశం కల్పించనుంది. లేఆఫ్ ఎదుర్కొన్న ట్రైనీలకు రిలీవింగ్ లెటర్‌తో పాటూ ఒక నెల ఎక్స్‌గ్రేషియో ఇవ్వనుంది. అయితే ఈ విషయాన్ని కంపెనీ ధ్రువీకరించలేదు. ఇదిలాఉండగా.. ఫ్రెషర్ల నియామకాల విషయంలో ఇన్ఫోసిస్ చాలాకాలంగా విమర్శలు ఎదుర్కొంటోంది. గత నెలలో వరుస ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో కర్ణాటకలోని మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీ ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. ఈ బలవంతపు లేఆఫ్‌లపై ట్రైనీలు పీఎంఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## టెలిగ్రామ్‌లో ఇక గ్రోక్ ఏఐ.. వీరికి మాత్రమే




బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ అంకుర సంస్థ 'ఎక్స్‌ఏఐ .. 'గ్రోక్' పేరిట చాట్‌బాట్ సేవల్ని తీసుకొచ్చి యూజర్లను ఆశ్చర్యపర్చింది. ఇప్పటివరకు కేవలం ఎక్స్ యూజర్లకు మాత్రమే పరిమితమైన ఈ సేవల్ని టెలిగ్రామ్ లో అందుబాటులోకి తెచ్చింది. ఎక్కువమంది యూజర్లకు ఈ సర్వీసుల్ని అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్‌ల సేవలు అందిస్తున్న సంస్థల మధ్య గట్టి పోటీ నెలకొంది. దీంతో యూజర్లను పెంచుకొనేందుకు ఆయా సంస్థలు కొత్త మోడళ్లను, అద్భుతమైన ఫీచర్లను పరిచయం చేస్తున్నాయి. ఇలా ఏఐ ప్రపంచంలో పోటీని ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా గ్రోక్ ఏఐ టెలిగ్రామ్‌తో చేతులు కలిపింది. ఇప్పటికే టెలిగ్రామ్‌లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయని గ్రోక్ తన 'ఎక్స్' హ్యాండిల్‌లో తెలిపింది. అయితే, ప్రీమియం యూజర్లకు మాత్రమే ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. టెలిగ్రామ్‌లో సెర్చ్ బార్‌లో "గ్రోక్ " అని టైప్ చేసి ఈ సర్వీసుల్ని వినియోగించుకోవచ్చు. మరోవైపు టెలిగ్రామ్ 2024 ఆగస్టు నుంచి చట్టపరమైన సమస్యల్ని ఎదుర్కొంటోంది. టెలిగ్రామ్ ద్వారా హవాలా మోసం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక దాడికి సంబంధించిన సమాచారం షేర్ చేయడం వంటి ఆరోపణల కారణంగా 'టెలిగ్రామ్' వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్ అరెస్ట్ అయ్యారు. అప్పటినుంచి కంపెనీ సవాళ్లు ఎదుర్కొంటోంది.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి క్లాసిక్ 650..



దేశీయ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ 650 సీసీ శ్రేణిని మరింత విస్తరిస్తూ మరో కొత్త మోటార్ సైకిల్‌ను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. చాలా రోజులుగా వాహన ప్రియులు ఎదురుచూస్తున్న క్లాసిక్ 650 ట్విన్‌ను ఎట్టకేలకు గురువారం లాంచ్ చేసింది. దీని ధరను రూ.3.37 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) నిర్ణయించింది. ఇందులో బ్లాక్ క్రోమ్ వేరియంట్ ధరను రూ.3.50 లక్షలుగా పేర్కొంది. ఇప్పటికే 650 సీసీ శ్రేణిలో ఇంటర్‌సెప్టర్ 650, కాంటినెంటల్ జీటీ 650, సూపర్ మెటోర్ 650, షాట్‌గన్ 650, బేర్ 650ని కంపెనీ లాంచ్ చేసింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ తన కొత్త క్లాసిక్ 650లోనూ నియో రెట్రోలుక్‌ను ఫాలో అయ్యింది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న క్లాసిక్ 350ని ఇది పోలి ఉంటుంది. రౌండ్ హెడ్ ల్యాంప్, టైగర్-ఐ పైలట్ ల్యాంప్స్‌తో టియర్ డ్రాప్ ఆకారంలో ఫ్యూయల్ ట్యాంక్ ఇచ్చారు. వల్లం రెడ్, బ్రంటింగ్‌థార్ప్ బ్లూ, టీల్, బ్లాక్ క్రోమ్ రంగుల్లో లభిస్తుంది. 19 అంగుళాల ఫ్రంట్ వీల్, 18 అంగుళాల రియర్ వీల్ ఇచ్చారు. వైర్ స్పోక్ వీల్స్ అమర్చారు. ఇంజిన్ విషయానికొస్తే.. ఇతర 650 సీసీ మోడళ్లలానే ఇందులోనూ 648 ఎయిర్‌ఆయిల్ కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 46.4 హెచ్‌పీ పవర్‌ను, 52.3 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్‌తో 6 స్పీడ్ గేర్ బాక్స్ వస్తోంది.

## ఆరోగ్య బీమా రంగంలోకి ఎల్ఐసీ.. మణిపాల్ సిగ్నాలో వాటా కొనుగోలు

ప్రభుత్వ రంగానికి చెందిన జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ ఆరోగ్య బీమా రంగంలోకి త్వరలో అడుగుపెట్టనుంది. మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో మైనారిటీ వాటాను కొనుగోలు చేయడానికి సిద్ధమైందని సమాచారం. సంబంధిత వర్గాలు ఈవిషయాన్ని పేర్కొన్నాయంటూ 'ఎకనామిక్ టైమ్స్' తన కథనంలో తెలిపింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ ఆరోగ్యబీమా మార్కెట్‌లో రంగ ప్రవేశం చేయాలని ఎల్ఐసీ చాలాకాలంగా ఎదురుచూస్తోంది. దీనికోసం చర్చలు ప్రారంభించినట్లు కంపెనీ సీఈఓ సిద్ధార్థ మొహంతి తాజాగా వెల్లడించారు. పూర్తి సమాచారాన్ని ఆయన వెల్లడించలేదు. అయితే మణిపాల్‌సిగ్నాలో 40- 49 శాతం వాటాను కొనుగోలు చేయనుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీని విలువ రూ.3,500-3,750 కోట్లుగా ఉంటుందని అంచనా. మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్, సిగ్నా కార్పొరేషన్ రెండూ కలిసి మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌గా సేవలు అందిస్తున్నాయి. ఈ కంపెనీలో ఎల్ఐసీ వాటా కొనుగోలుతో మూడు సంస్థలు భాగస్వామ్యం కానున్నాయి. మణిపాల్ సిగ్నాలో మైనారిటీ వాటా కొనుగోలుకు బీమా సంస్థ ఇప్పటికే సూత్రప్రాయంగా బోర్డు ఆమోదం పొందిందని ఓ అధికారి తెలిపారు. వాటా విక్రయానికి సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని ఆయన వెల్లడించలేదు. ఈ డీల్ తుది ఆమోద ప్రక్రియ త్వరలోనే పూర్తి కానుందన్నారు.




www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# రామ్‌చరణ్ బర్త్‌డే స్పెషల్ వచ్చేసింది

మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రోజు వచ్చేసింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న సినిమా 'పెద్ది' నుంచి అప్‌డేట్ వచ్చింది. చరణ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ యూనిట్ ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి విషెస్ చెప్పింది. లాంగ్ హెయిర్.. గుబురు గడ్డంతో ఉన్న సరికొత్త లుక్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఇక ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ ఖరారు చేసినట్లు తెలిపింది. స్పోర్ట్స్ నేపథ్యంలో ఈ సినిమా సిద్ధమవుతోందని టాక్. 'ఉప్పెన' తర్వాత సుమారు రెండేళ్లపాటు కష్టపడి బుచ్చిబాబు దీనిని సిద్ధం చేశారు. ఇందులో రామ్‌చరణ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండనుంది. జాన్వీకపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్‌తోపాటు జగపతిబాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. రెహమాన్ స్వరాలు అందిస్తున్నారు. ఇప్పటికే రెండు పాటలు పూర్తి చేశానని ఇటీవల రెహమాన్ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా దీనిని నిర్మిస్తున్నాయి.



# నితిన్‌కు క్షమాపణలు చెప్పిన ఆది పినిశెట్టి





టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ నటించిన తాజా చిత్రం రాబిన్ హుడ్. ఛలో, భీష్మ చిత్రాలను తెరకెక్కించిన వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎక్స్‌ట్రార్డీనరి మ్యాన్ తర్వాత నితిన్ తో మరోసారి జత కట్టింది శ్రీలీల. అలాగే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో క్యామియో రోల్ పోషించనున్నాడు. ఇక కేతిక శర్మ స్పెషల్ సాంగ్ లో సందడి చేసింది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న రాబిన్ హుడ్ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నితిన్ సినిమాకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు మరో నటుడు ఆది పిని శెట్టి. అదే సమయంలో ఒక విషయంలో తనను క్షమించాలని నితిన్ ను కోరాడు. ఈ మేరకు ఆది పినిశెట్టి చేసిన ట్వీట్ ఇప్పుడు వైరలవుతోంది. గత నెలలో ఆది పినిశెట్టి హీరోగా నటించిన శబ్దం సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో లక్ష్మీ మేనన్ హీరోయిన్ గా నటించింది. ఆకట్టుకునే కథా, కథనాలు, విజువల్స్, బీజీఎమ్ ఇలా శబ్దం సినిమాలో చాలా పాజిటివ్ అంశాలు ఉండడంతో ఆడియెన్స్ ను బాగానే మెప్పించింది. అయితే శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో నితిన్ ఒక ట్వీట్ చేశాడు. ఆది పినిశెట్టితో పాటు శబ్దం మూవీ యూనిట్ కు ఆల్ ది బెస్ట్ చెబుతూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు. అయితే తన సినిమా ప్రమోషన్ల లో బిజీగా ఉన్న ఆది పినిశెట్టి నితిన్ ట్వీట్ కు రిప్లై ఇవ్వలేకపోయాడట. ఈ క్రమంలోనే నితిన్ సినిమా రాబిన్ హుడ్ సినిమా రిలీజ్ నేపథ్యంలో ఆది పినిశెట్టి ట్వీట్ పెట్టాడు. నితిన్ కు సారీ చెబుతూ రిప్లై ఇచ్చాడు. 'ఇంత లేట్ అయినందుకు సారీ. అప్పుడు శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో ఇష్యూ ఉండడం వల్ల సరిగ్గా స్పందించలేకపోయాను. ఇంత లేటుగా రిప్లై ఇస్తున్నందుకు సారీ' అని ట్వీట్ చేశాడు. అలాగే నితన్ రాబిన్ హుడ్ సినిమా యూనిట్ కు ఆల్ ది బెస్ట్ కూడా చెప్పాడు ఆది పినిశెట్టి. ప్రస్తుతం ఈ ట్వీట్ కూడా నెట్టింట వైరలవుతోంది.

# అది నయం కావడానికి 9 నెలలు పడుతుంది

## నటి రష్మిక



**హైదరాబాద్:** ఓవైపు వరుస సినిమా షూట్స్, మరోవైపు ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా గడుపుతున్నారు నటి రష్మిక. ఈ క్రమంలోనే ఆమె కొన్ని రోజులుగా ఇన్‌స్టాకు దూరంగా ఉంటున్నారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ తాజాగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సరదాగా బదులిచ్చారు. తన ఇష్టాయిష్టాలను పంచుకున్నారు. అదేవిధంగా ఇటీవల తన కాలుకు గాయం కావడం పైనా ఆమె మాట్లాడారు. తాను ఇప్పుడిప్పుడే ఆ గాయం నుంచి కోలుకుంటున్నానని తెలిపారు. "కాలు ఇప్పుడిప్పుడే నయం అవుతుంది. కానీ పూర్తిగా సెట్ కావడానికి ఇంకా 9 నెలల సమయం పడుతుంది. కాకపోతే ఇప్పుడు పరిస్థితి మెరుగుపడింది. వర్క్ లైఫ్‌లో ఫుల్ బిజీ అయిపోయా" అని ఓ అభిమానికి బదులిచ్చారు. జనవరి నెలలో రష్మిక గాయపడ్డారు. జిమ్‌లో వర్కౌట్లు చేస్తుండగా తనకు గాయమైందని తెలియజేస్తూ ఆమె ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ఆ తర్వాత కొన్నిరోజల పాటు షూట్స్‌కు దూరంగా ఉన్నారు. సినిమా ప్రమోషన్స్‌కు వీల్ ఛైర్‌లో హాజరయ్యారు. ఇటీవల ఆమె నటించిన 'ఛావా' ఘన విజయాన్ని అందుకుంది. సల్మాన్ ఖాన్‌తో ఆమె యాక్ట్ చేసిన 'సికందర్' విడుదలకు సిద్ధంగా ఉంది. 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి.



# 'మ్యాడ్ స్క్వేర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

**హైదరాబాద్:** విజయవంతమైన 'మ్యాడ్'కి కొనసాగింపుగా రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'.. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన పాత్రధారులు. కల్యాణ్‌శంకర్ దర్శకుడు. హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మాతలు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ చిత్రం ఈ నెల 28న రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

# అలియా భట్‌కు నేషనల్ అవార్డు.. అసూయపడ్డాను : సారా అలీఖాన్



బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్‌కు నేషనల్ అవార్డు వచ్చినప్పుడు తనకు అసూయ కలిగిందన్నారు నటి సారా అలీఖాన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె అలియా జీవితం ప్రస్తుతం ఎంతో ఆనందంగా ఉందన్నారు. "అలియా ఎంతో ఆనందంగా ఉంది. సినిమాల విషయంలోనే కాదు.. వ్యక్తిగతంగానూ ఆమె సంతోషంగా జీవిస్తున్నారు. ఈ స్థాయికి రావడం కోసం ఆమె ఎంతో కష్టపడింది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. కానీ.. ఆమెకు జాతీయఅవార్డు వచ్చినప్పుడు ఒక నటిగా నేను అసూయ పడ్డాను. అలాంటి సినిమాలో నాకు అవకాశం ఎందుకు రాలేదనిపించింది. ఎదుటివారిని చూసి అసూయపడడం సహజం. దాని వెనక ఎంత కష్టం ఉంటుందో ఎవరికీ అర్థం కాదు. ఆ కష్టాన్ని ఎవరూ చూడరు. అవార్డును మాత్రమే చూస్తారు. నేనూ అలానే భావించాను" అని సారా అలీఖాన్ చెప్పారు. ఇక 'గంగూబాయి కాఠియావాడి'లో వేశ్య పాత్రకు గాను అలియా భట్‌కు నేషనల్ అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అలియా 'లవ్ అండ్ వార్'లో నటిస్తోంది. రణ్‌బీర్ కపూర్‌తో కలిసి ఇందులో సందడి చేయనుంది.

# ఆ విషయం రజనీకాంత్ నుంచి నేర్చుకున్నా : శ్రుతి హాసన్



సినీప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో రజనీకాంత్ 'కూలీ' ఒకటి. ఈ సినిమాలో నటి శ్రుతిహాసన్ కీలకపాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రజనీతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గురించి శ్రుతి మాట్లాడారు. 'కూలీ' లాంటి భారీ బడ్జెట్ సినిమాతో పాటు తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రల్లో చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని శ్రుతి తెలిపారు. "రజనీకాంత్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. అంతపెద్ద స్టార్‌గా ఎలా ఎదిగారో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు అర్థమైంది. ఆయన క్రమశిక్షణ, అంకితభావం, పాత్ర కోసం కష్టపడేతత్వం ఇలా ఎన్నో విషయాల్లో ఆయన్ని చూసి స్ఫూర్తిపొందాను. వినయంగా ఉంటారు. సెట్‌లో ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా పని చేస్తారు. ఆయన సెట్‌లో ఉంటే పాజిటివ్‌గా అనిపిస్తుంది. ఒక వ్యక్తిగానూ ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ముఖ్యంగా ఇతరులతో ఎలా వ్యవహరించాలో రజనీకాంత్‌ని చూసి తెలుసుకున్నా. 'కూలీ'లో నా పాత్ర చాలా సింపుల్‌గా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అవుతుంది. లోకేశ్ దర్శకత్వంలో వర్క్ చేయడం నా కల. అందుకే ఆయన ఈ సినిమా గురించి చెప్పగానే అంగీకరించాను. ఇలాంటి సినిమాల్లో విభిన్నమైన పాత్రలు ఉంటాయి వాటిని తెరపై చూపించడం నిజంగా సవాలే. లోకేశ్ వాటన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని దీన్ని తెరకెక్కించారు" అని శ్రుతిహాసన్ తెలిపారు. రజనీకాంత్ – డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రమే 'కూలీ'. ఇటీవలే దీని చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమాలో నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషించారు. పూజాహెగ్డే ప్రత్యేక గీతంతో సందడి చేయనున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com